సూర్య
నేటి దినపత్రిక
17వ వసంతంలోకి
www.suryaa.com
చిత్తూరు | తిరుపతి
శుక్రవారం | 19 జులై 2024 | పేజీలు 11

# రెడ్‌బుక్ రాజ్యాంగం ఎక్కువ రోజులు ఉండదు

**పుంగనూరులో మిధున్ రెడ్డి పర్యటనలో ఉద్రిక్తత**

**మిథున్ రెడ్డిపై హత్యాయత్నం చేసిన టీడీపీ గుండాలు**

**కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎంపీ మిథున్ రెడ్డికి వై కేటగిరి సెక్యూరిటీని కేటాయించాలి**

**వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎన్.నాగరాజు డిమాండ్**

మిగతా 2లో

**వి.కోట, మేజర్‌న్యూస్:** పుంగనూరులో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పర్యటనలో టీడీపీ కవ్వింపు చర్యలకు తెరలేపింది. పుంగనూరు లోని మాజీ ఎంపీ రెడ్డప్ప నివాసంలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి వైకాపా కార్యకర్తలపై జరిగిన దాడులుపై ఎంపీ విచారిస్తుండగా, తెలుగుదేశం నాయకులు పెద్దపెద్ద కర్రలతో, ఇనుప రాడ్లతోవచ్చి ఎంపీ మిధున్ రెడ్డిపై హత్యాయత్నానానికి పాల్పడ్డారు. ఒక దళిత వర్గానికి చెందిన మాజీ ఎంపీ రెడ్డప్ప ఇంటి మీదికి రాళ్లు విసురుతూ విధ్వంసం సృష్టిస్తున్నారు. ఈ దాడిలో పలువురు వైకాపా నాయకులు తీవ్రంగా గాయపడ్డారు.



# ప్రజలకు విస్తృత సేవలు అందించడమే ప్రధాన కర్తవ్యం



**ప్రజా సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకునేందుకే డయల్ యువర్ ఎమ్మెల్యే**

**ముఖ్యమంత్రి చంద్రబాబు అడుగుజాడల్లో నియోజకవర్గ అభివృద్ధికి కృషి**

**అభివృద్ధికి సహకరించే వారికి అండగా ఉంటా**

**అడ్డుకుంటే సహించే ప్రసక్తే లేదు**

**చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్**

**చిత్తూరు బ్యూరో, మేజర్‌న్యూస్:** ప్రజలకు విస్తృతమైన సేవలను అందించి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అడుగుజాడల్లో ఆయన ఆధ్వర్యం లో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రాల్లో ఏ నియోజకవర్గ శాసనసభ్యులు నిర్వహించని డయల్‌యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌లను ఆదర్శంగా తీసుకొని చిత్తూరు నియోజకవర్గంలో ప్రతి గురువారం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గతవారం నిర్వహించిన డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి నియోజకవర్గ ప్రజల నుండి అపూర్వ స్పందన లభించింది. అంతే కాకుండా చిత్తూరు శాసనసభ్యులు నిర్వహించిన డైట్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. అందులో భాగంగానే గురువారం సైతం శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వర్తిస్తున్నారు. గతవారంకంటే ఈ వారం నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను అధిక సంఖ్యలో ప్రత్యక్షంగా ఫోన్ ద్వారా శాసన సభ్యుల దృష్టికి తీసుకురావడం జరిగింది. గత వారం నిర్వహించిన కార్యక్రమం ద్వారా 39 మంది తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టి తీసుకురాగా అందులోని 80% సమస్యలను కేవలం ఒక వారంలోనే పరిష్కారాన్ని నగరపాలక సంస్థ అధికారుల ఆధ్వర్యంలో చూపబడింది. ప్రస్తుతం నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 50మందికి

మిగతా 2లో

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన

**తరలివచ్చిన జిల్లా యంత్రాంగం**

**సమస్యల పరిష్కారం కొరకు పోటెత్తిన అర్జీదారులు**

**ప్రతి సమస్యను పరిష్కరిస్తాం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్**

**కుప్పం, మేజర్‌న్యూస్:** ప్రజా సమస్యలే పరిష్కారం, సంక్షేమం సాధనలో టిడిపి ప్రభుత్వం ముందు అడుగు వేస్తూ కుప్పంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగానే ప్రతివారం సమస్యల పరిష్కార వేదికను కుప్పం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్నారు. అర్జీలు స్వీకరించడానికి స్వయంగా జిల్లా కలెక్టర్ విచ్చేస్తుండడంతో నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు వచ్చి వినతులు ఇచ్చి తమ గోడును వెల్లడిస్తున్నారు. దీనికి స్పందనగా అధికార యంత్రాంగం సైతంప్రతి సమస్యకు పరిష్కారం చూపుతుండడంతో వారం వారం ప్రజాసమస్యల పరిష్కార వేదికకు జనం వెల్లువాలా వస్తున్నారు.



పెన్షన్ కోసం పొన్నంగూరు నుంచి వచ్చిన వృద్ధురాలు కన్నమ్మ

**జనమయంగా ప్రజాసమస్యలపరిష్కార వేదిక**

జూన్ 4న ఎన్నికలు ఫలితాలు వెలువడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నేతృత్వంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడడంతో సంస్కరణలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి ప్రాతినిథ్యంవహిస్తున్న కుప్పంలో సంస్కరణలు త్వరగా మొదలయ్యాయి. ఇందుకు ఉదాహరణ కుప్పంలో వారం వారం చేపడుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఈ వేదికకు స్వయంగా కలెక్టర్, జిల్లా యంత్రాంగం



మిగతా 2లో

# ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడా..? వైయస్ జగన్మోహన్ రెడ్డా..?

**సచివాలయంకి వచ్చిన అర్జీదారులు అధికారుల తీరు పట్ల ముక్కున వేలేసుకుంటున్నారు...**

**బాలయపల్లి, మేజర్‌న్యూస్:** ప్రభుత్వం మారిన అధికారులు తీరు మారలేదు అన్న దానికి నిదర్శనం వెంకటగిరి నియోజకవర్గం బాలాయపల్లి మండలం పరిధిలోని కోటంబేడు సచివాలయం భవనం చూస్తే ఇట్టే అర్థమవుతుంది. గత వైసిపి ప్రభుత్వంలో సచివాలయం నిర్మించారు. ఇటీవల జరిగిన సారత్విక ఎన్నికల్లో వైస్సార్సీపీ పార్టీ పరాభవం చెంది ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వంమారి నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రభుత్వ కార్యాలయాలు భవనాల వద్ద మాజీ సీఎం ఫోటోలు, మాజీ ఎమ్మెల్యే ఫోటోలు తొలగించారు. అయినా బాలాయపల్లి మండలం పరిధిలోని కోటంబేడు సచి వాలయం మాత్రం సంబంధిత అధికారులు వైసీపీపై ఉన్న అభిమానాన్ని మర్చిపోలేదు. కోటంబేడు సచివాలయంలో మాజీ సీఎం వైఎస్ జగ న్మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి ఫోటోలు ఇప్పటికే దర్శనమిస్తున్నాయి.




# టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు నిర్వహిస్తే సహించేది లేదు

**రాష్ట్ర మంత్రి రాంప్రసాద్ రెడ్డి**



**కల్లూరు, మేజర్‌న్యూస్:** ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులపై దాడులు నిర్వహిస్తే సహించేదిలేదని రాష్ట్ర మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. గురువారం పుంగనూరు నియోజకవర్గం రొంపిచర్ల టిడిపి ఇన్చార్జ్ చల్లాబాబు రెడ్డి నివాసంలో మీడియా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుంగునూరు నియోజకవర్గం ప్రజలను అన్నివిధాల పెద్దిరెడ్డి కుటుంబం దోచుకున్నదని, నియోజకవర్గంలో కొన్ని వందలఎకరాలను దోచుకోవడం జరిగిందని ఆరోపించారు. పుంగనూరు నియోజకవర్గంలోకి ఎంపీ మిధున్ రెడ్డి దొంగ చాటున పుంగనూరుకు వచ్చి తిరుపతి తదితర ప్రాంతాల నుండి అనేకమంది రౌడీలను తీసుకొని వచ్చి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకుల పైన దాడులు నిర్వహించి వాహనాలను ధ్వంసం చేయడం జరిగిందన్నారు. పెద్దిరెడ్డి కుటుంబానికి పుంగునూరు నియోజకవర్గ ప్రజల శాపాలు తగులుతాయని, నియోజకవర్గంలో శివ శక్తి డైరీని నడుపుతూ పాడి రైతులకు వారు ఇచ్చే రేట్లు తీసుకుంటూ రైతులు తీవ్రంగా నష్టపోవడం జరిగిందన్నారు. ఎక్కడైనా భూములు ఆక్రమించి ఉంటే వాటిని మళ్లీ తిరిగి ప్రజలకే ఇవ్వటం జరుగుతుందన్నారు. వైయస్సార్సీపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మదనపల్లి, పుంగనూరు ప్రాంతాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించినప్పుడు అనేకమంది కార్యకర్తల పైన నాయకులపైన కేసులు పెట్టి చిత్రహింసలు చేయడం జరిగిందని అన్నారు. ఎంపీ మిధున్ రెడ్డి ఇంకా కూడా వైయస్సార్సీపి అధికారంలో ఉన్నట్లు అహంకారంతో ఉన్నారన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపైన, నాయకులపైన అనేక కేసులు పెట్టి చిత్రహింసలకు గురి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో రామనాథం నాయుడు పాల్గొన్నారు.



## శ్రీవారిని దర్శించుకున్న చంద్రగిరి ఎమ్మెల్యే నాని

**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని దర్శించుకున్నారు. గురువారం ఉదయం విఐపి విరామ సమయంలో కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారి పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా ఆలయ అధికారులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు. ఆలయం వెలుపల చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ ప్రజాపాలనకు ప్రజలు పట్టంగట్టారని చెప్పిన ఆయన 30 ఏళ్ల అనంతరం చంద్రగిరిలో టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందానని తెలియజేశారు. అభివృద్ధిలో ఆదర్శ నియోజకవర్గంగా చంద్రగిరిని తీర్చి దిద్దుతాని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేగా 5ఏళ్లు పదవీకాలం ఉంటే నాలుగేళ్లలోనే చంద్రగిరిని సర్వతోముఖాభీవృద్ధి చేస్తానని అన్నారు.



## ప్రత్యేకాలంకరణలో బోయకొండ గంగమ్మ



**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** ప్రముఖ పుణ్యక్షేత్రం బోయకొండ గంగమ్మ దేవస్థానం నందు ఆషాడ మాసం సందర్బముగా ప్రత్యేక అలంకరణ చేశారు. ఆషాడమాసం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయాన్నే ఐదు గంటలకే భక్తులు క్యూలైన్లో వేచిఉన్నారు. భక్తులకు విశేష అలంకరణ చేసి దర్శన భాగ్యం కల్పించారు. దేవస్థాన ఈ.వో ఏకాంబరం భక్తుల సౌకర్యాలను పరివేక్షించారు.

## మహిళ వర్సిటీ ఇన్చార్జి వీసీగా ఆచార్య వి.ఉమ

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంచార్జ్‌ఉపకులపతిగా ఆచార్య వి.ఉమ నియమితులయ్యారు. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ మండలి నుంచి ఉత్తర్వులు జారీచేసింది. ఈమె గతంలో శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఆచార్య దుర్గాభవాని ఉపకులపతిగా ఉన్నప్పుడు విశ్వవిద్యాలయం మొట్టమొదటి రెక్టార్‌గా సమర్థవంతంగా విధులను నిర్వహించారు. రాష్ట్ర ప్రభు త్వం శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో సీనియర్ ఆచార్యులైన ఆచార్య ఉమను శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాల యం ఇన్చార్జి ఉపకులపతిగా నియమితులయ్యారు. శుక్రవారం ఉదయం వీసీగా బాధ్యతలు చేపట్టనున్నారు.



## చేనేత హస్త కళలను ఆదరించండి

### హస్తకళ మేళాను ప్రారంభించిన ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** చిత్తూరు చేనేత హస్త కళలను ఆదరించాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కోరారు. నగరంలోని స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శన కళాసిల్క్ మేళాను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భారతదేశం చేనేత హస్తకళలకు నిలయమని ఆధునిక భారత దేశంలోనూ చేనేత కలలు భారతదేశంలో ఆదరణ పొందుతున్నట్లు తెలిపారు. ఈ వృత్తిపై ఆధారపడిన అనేకమంది చేనేత హస్తకళ కళాకారులు జీవనం సాగిస్తున్నారని వీరిని ఆదుకునే విధంగా చేనేత హస్తకళకారులు తయారుచేసిన వస్తువులు కొనుగోలు చేయాలన్నారు. చిత్తూరు టిటిడి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శనలు కన్యా కుమారి నుండి కాశ్మీర్ వరకు దేశవ్యాప్తంగా చేనేత హస్త కళాకారులు తయారుచేసిన వస్తువులను ప్రదర్శన అమ్మకానికి ఉంచుతున్నట్లు చెప్పారు. చిత్తూరు నగర పరిసర ప్రాంతాల్లోని ప్రజలు చేనేత హస్తకళ వస్తువులను కొనుగోలు చేసి చేనేత హస్త కళాకారులను ఆదుకోవాలని కోరారు.



## వీఎస్‌యు ఇన్చార్జ్ వీసీగా ఆచార్య విజయభాస్కరరావు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయానికి ఇన్చార్జి ఉపకులపతిగా శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం లోని భౌతిక శాస్త్ర విభాగపు సీనియర్ ఆచార్యులు, యూజీసీ అకాడమిక్ రీసెర్చ్ డీన్, డీఎస్టి పర్స్‌సెంటర్ డైరెక్టర్ ఆచార్య ఎస్ విజయభాస్కరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ మండలి నుంచి ఉత్తర్వులు అందాయి. శుక్రవారం ఉదయం తొమ్మిదిన్నర గంటలకు నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉప కులపతి ఛాంబర్‌లో ఇంచార్జ్ ఉపకులపతిగా పదవి బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు ఆచార్య ఎస్.విజయభాస్కరరావు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థుల అందరి సహకారంతో తన వంతు కృషి చేస్తానన్నారు. ఎస్వీయూలోని భౌతిక శాస్త్రం విభాగంలోని ఆయన చాంబర్లో పలువురు ఎస్వీయూ బోధన, బోధననేతర సిబ్బంది, పరిశోధకులు, అకడమిక్ కన్సల్టెంట్లు, విద్యార్థులు పుష్పగుచ్చాలు, దుశ్శాలువలతో శుభాకాంక్షలు తెలిపారు.



# ప్రజలకు విస్తృత సేవలు అందించడమే ప్రధాన కర్తవ్యం

(మొదటిపేజీ తరువాయి)

పైగా తమ సమస్యలను శాసనసభ్యులు దృష్టికి తీసుకురావడం జరిగింది. తక్షణం ఆ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ పరిధిలోని వివిధశాఖ అధికారులకు గురజాల జగన్మో సూచించారు. అనంతరం శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ పాత్రికేయులతో మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం తాను ఎల్లప్పుడూ కృషి చేస్తూనే ఉంటానని ఇప్పటికే నియోజకవర్గ అభివృద్ధి కోసం అనేక ప్రణాళికలు సిద్ధం చేసుకుని ఉన్నానని అందులో భాగంగానే చిత్తూరు ప్రధాన సమస్యగా మారిన కాలువల మరమ్మత్తు, ప్రధాన రహదారుల క్రమబద్ధీకరణ, నిత్యం ప్రజలకు అవసరమయ్యే ప్రధాన కూరగాయల మార్కెట్ స్థానంలో అత్యాధునిక వసతులతో వెజిటేబుల్ మార్కెట్ యార్డ్, పాత బస్టాండ్ సముదాయంలో షాపింగ్ కాంప్లెక్స్, యూనివర్సిటీల ఏర్పాటుకు చర్యలు, కట్టమంచి చెరువు, నివానది పరిసర చెరువులలో ఆధునీకరణమైన అభివృద్ధికి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. అలాగే నియోజకవర్గ అభివృద్ధికి సహకరించే వారిని ఆదరించి వారికి అండగా ఉంటానన్నారు. అలా కాకుండా అభివృద్ధికి అడ్డు తగిలితే వారు ఎంతటి వారైనను ప్రజాసంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అణచి వేసేందుకు కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరికలు జారీ చేశారు. శాంతి భద్రత పరిరక్షణలో ఏమాత్రం రాజీపడనని అన్నారు. యావత్ రాష్ట్ర ప్రజలు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై ఉన్న నమ్మకంతో అత్యధిక మెజార్టీని కూటమి పార్టీలకు అందించాలని వారి నమ్మకాన్ని ఏమాత్రం వమ్ము చేయకూడదని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులకు శాసనసభ్యులకు పార్టీ క్యాడర్‌కు తెలియజేసి ఉన్నారన్నారు. ఆయన ఆదేశాలను చిత్తూరు నియోజకవర్గంలో తాను అమలు పరుస్తున్నానని గురుజాల జగన్మోహన్ పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి ఏ ఒక్కరి వల్ల సాధ్యం కాదని సమిష్టిగా కృషి చేస్తేనే చరిత్ర కలిగిన చిత్తూరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలో అభివృద్ధి పరంగా మొదటి స్థానంలో నిలిపేందుకు సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ అరుణ రెవెన్యూ ఇన్స్పెక్టర్ వర్మ. సిఎంఎం గోపి కాకర్లు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన

(మొదటిపేజీ తరువాయి)

వస్తుండడంతో సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతున్నాయి. సమస్యలు పరిష్కారం అవుతుండడంతో అర్జీదారుల ఆనందంతోపాటు వారం వారం స్పందన పెరుగుతుంది. గురువారం కుప్పం నియోజకవర్గంలో నుంచి సుమారు వందల సంఖ్యలో అర్జీదారులు వచ్చి తమ సమస్యలను కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులుకు విన్నవించుకున్నారు. స్పందించిన కలెక్టర్ సగానికి పైగా సమస్యలను అక్కడికి అక్కడే పరిష్కరించారు. మిగిలిన సమస్యలను ఆయా శాఖలకు పరిష్కారం దిశగా సూచనలు చేశారు. దీంతో తమ గోడును వెళ్ళు భుచ్చుకునేందుకు వచ్చిన అర్జీదారులు సంతోషముతో తిరుగు ముఖం పట్టారు.

**తరలివచ్చిన జిల్లా యంత్రాంగం...** ముఖ్యమంత్రి నియోజకవర్గ కేంద్రంలో సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రతివారం జిల్లా యంత్రాంగం మొత్తం వచ్చి సమస్యలను అక్కడికి అక్కడే పరిష్కరిస్తున్నారు. గురువారం వచ్చిన అధికారులలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, కడా ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్, డ్వామా పిడి ఎన్.రాజశేఖర్, కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులు వీరితోపాటు వీరితోపాటు నియోజకవర్గ, మండల గ్రామ పంచాయతీ మండల పంచాయతీ స్థాయి అధికారులు రావడంతో సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమయ్యాయి.

**బాబు పెన్షన్ ఇవ్వండి...** బాబు నాకు పెన్షన్ ఇవ్వండి అంటూ పొన్నంగురుకు చెందిన 85 సంవత్సరాల కన్నమ్మ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ సుమిత్ కుమార్‌కు తన గోడు చెప్పుకొంది. గత ప్రభుత్వాలు,నాయకులు అధికారులు ఎన్ని మార్లు వినతులు చేసుకున్న నా వృద్ధాప్యాన్ని చూసి కనికరించలేకపోయారంటూ.. కన్నమ్మ కలెక్టర్ ముందు ఆవేదన వ్యక్తం చేసింది. స్పందించిన కలెక్టర్ వెంటనే విచారణ చేసి కన్నమ్మకు పెన్షన్ ఇవ్వాలని ఆదేశించారు. దీంతో కన్నమ్మ సంతోషంగా తిరుగు ముఖం పట్టింది.

**ప్రతి సమస్యను పరిష్కరిస్తాం: జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్**

ఎంతో ఉన్నత ఆశయంతో చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. ప్రజలు జిల్లా యంత్రాంగం మొత్తం వచ్చి నిర్వహించే ఈ వేదికను సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజా సమస్యల పట్ల ప్రత్యేక చొరవ చూపుతూ ఇలాంటి వేదికలను చేపట్టారని ప్రజలు సహకరించి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు.



## రెడ్ బుక్ రాజ్యాంగం ఎక్కువ రోజులు ఉండదు

(మొదటిపేజీ తరువాయి)

ప్రజాస్వామ్యంలో ప్రజల చేత ఎన్నుకున్న ఒక యం.పి దాడి అత్యాయత్నం చేయడానికి టిడిపి అల్లరి మూకలు ప్రయత్ని స్తుంటే పోలీసులు అక్కడే ఉంటూ జరుగుతు న్న దాడిని నిలుపుదల చేయకుండా అడ్డు కోకుండా పోలీసులు ఎంత నిర్లక్ష్య ధోరణితో ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు అంటే దీని కంతటి సంకేతం ఏమిటని వై.యస్.ఆర్.సీపి రాష్ట్ర కార్యదర్శి పి.యన్.నాగరాజు ప్రశ్నించారు. ప్రశాంతమైన పుంగనూరులో తెలుగు దేశం విధ్వంసం సృష్టిస్తుంటే ప్రజా సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. పుంగ నూరులో వై.యస్ కాంగ్రెస్ పార్టీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిపై జరిగినదాడిని ఆ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రజాస్వామ్యంలో చట్టబద్ధంగా ఎన్నికైన ఎంపీ మీద దాడి అంటే ఇది ప్రజాస్వామ్యంపై దాడిగా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అభివర్ణిస్తుంది. ముఖ్యమంత్రిగా దాదాపు 40 రోజుల క్రితం బాధ్యతలు తీసుకున్న చంద్రబాబు నాయుడు ఇప్పటికీ రాష్ట్రంలో శాంతి భద్రతలపై పట్టు సాధించకపోవడం శోచనీయం.దాదాపు ఈ ఒకటిన్నర నెల కాలంలో వైయస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ శ్రేణుల పై, వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ సానుభూతి పరులపై, వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఓటేసిన ప్రజానీకంపై దాడులు జరుగుతూనే ఉంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, హెూంమంత్రి ఎందుకు మౌనంగా ఉన్నారని మేము ప్రశ్నిస్తున్నాం. ఇకనైనా ఈ అటావిక దాడులు ఆపి ప్రజా సంక్షేమం వైపు ప్రభుత్వం దృష్టి సాధించాలని నేను డిమాండ్ చేస్తున్నాను. మా పార్టీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి ప్రాణహాని ఉందని, కేంద్ర ప్రభుత్వం వెంటనే ఇందులో జోక్యం చేసుకొని అతనికి వై కేటగిరి సెక్యూరిటీ కల్పించాలని వై.యస్.ఆర్ రాష్ట్ర కార్యదర్శి పి.యన్.నాగరాజు డిమాండ్ చేస్తున్నాను.

## ఎస్వీఎం వెంకటేష్‌కు సత్కారం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:**

గోవింద ధామం నూతన కమిటీలో ఉపాధ్యక్షులుగా ఎన్నికైన ఎస్వీఎం వెంకటేష్‌ను వినాయక నిమజ్జన కమిటీ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం గోవింద నామంలో ఎస్‌విఎం వెంకటేష్‌ను వినాయకనిమజ్జనకమిటీ శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్వీఎం వెంకటేష్ గోవిందా ధామం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. వినాయక నిమజ్జన కమిటీ సభ్యులు గుండాల గోపీనాథ్ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, టీ. సుబ్రహ్మణ్యం రెడ్డి, అజయ్ కుమార్, చెన్నం నవీన్ వాసు, గోపి, ప్రసాద్, డిపి ఆనంద్, కరాటి శ్రీనివాస్, కళ్యాణ్ పాల్గొన్నారు.



## వృద్ధాశ్రమంలో జన్మదిన వేడుకలు

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** 'కార్వేటినగరంలో ఉన్న రాస్ వృద్ధాశ్రమంలో ఎంఎం విలాసం పంచాయతీ గుండుగాని కాలనీకి చెందిన హయాన్స్ మొదటి పుట్టినరోజు సందర్భంగా జన్మ దిన వేడుకలు వృద్ధుల మధ్యలో జరుపుకున్నారు. వారి తల్లిదండ్రులు మాట్లాడుతూ వృద్ధుల మధ్యలో జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు తండ్రి ఎం.విజయ భాస్కర్ తల్లి రామకుమారి తాత చిత్రయ్య అవ్వ రాణమ్మ అమ్మమ్మ రుమాదేవి తాత బాలసుబ్రహ్మణ్యం మేనమామ ముకేశ్, చంద్రశేఖర్. శ్రీనివాసులు, బాలాజీ సిబ్బంది పాల్గొన్నారు.



## కలెక్టర్ దృష్టికి వైసీపీ నాయకుడి భూ ఆక్రమణ

**కుప్పం, మేజర్‌న్యూస్:** వైసీపీ ప్రభుత్వ హయాంలో ఓ వెలుగు వెలిగిన కుప్పం మండల వైఎస్సార్సీపీ కన్వీనర్ హెచ్ఎం మురుగేష్ భూ ఆక్రమణను ఎమ్మార్పీఎస్ నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వివరాలలోకి వెళితే కుప్పం మండలం వైయస్సార్సీపీ కన్వీనర్‌గా చేసిన హెచ్ఎం మురుగేష్ మల్లనూరు సమీపంలోని చెరువును ఆక్రమించుకొని శాశ్వత నిర్మాణాలు చేపట్టారని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆరోపించారు. అప్పట్లో ఎమ్మార్పీఎస్, టిడిపి నాయ కులు అభ్యంతరం వ్యక్తం చేసిన ఫలితం లేకపోయింది. దీంతో ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భూ ఆక్రమణను కలెక్టర్ సుమీత్ కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన దీనిపై విచారణ చేపట్టాలని స్థానిక తహసీల్దార్‌కు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీ ఎస్ చిత్తూరు జిల్లా అధ్యక్షులు ఎంపీ.ప్రకాష్, మల్లనూరు టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ దాము, మల్లనూర్ పార్టీ అధ్యక్షులు రమేష్, మాజీ ఎంపిటిసి విభూషణ్, అన్నాదురై, రాజ్ కుమార్,ప్రేమ్ కుమార్, వెంకటేష్, సుభాష్,లు పాల్గొన్నారు.



## ఉరివేసుకొని మహిళ ఆత్మహత్య

**పెళ్లకూరు, మేజర్‌న్యూస్:** ఊరేసుకొని మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని శిరసనంబేడు రాజుపాలెంలో చోటు చేసుకుంది. స్థానికు లు పోలీసులుకు సమాచారం అందించడంతో స్థానిక ఎస్సై కె.శ్రీకాంత్ ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరశీలించారు. పోలీసులు కథనం మేరకు మండలంలోని శిరసనంబేడు రాజుపాలెం గ్రామానికి చెందిన దొమ్మ రాజు నరసమ్మ (65) గత కొద్ది రోజులుగా మతి స్థిమితం లేక బాధపడుతూ ఉందని, గ్రామ సమీపంలోని అడివిలో మంచానికి ఉన్న నవారు తీసుకొని చెట్టు కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులు వివరించారు.దీంతో ఎస్సై కె.శ్రీకాంత్ ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతురాలుకి భర్త ఇద్దరు పిల్లలు ఉన్నారు.



## ప్రాథమిక పాఠశాల పునఃప్రారంభం

**కుప్పం, మేజర్‌న్యూస్:** కుప్పం మండల పరిధిలోని చందం గ్రామంలో ప్రాథమిక పాఠశాలను గురువారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టిడిపి కుప్పం ఇంచార్జ్ ముని రత్నం ప్రారంభించారు. గ్రామంలో పాఠశాలను పునః ప్రారంభించాలని విద్యార్థుల తల్లి దండ్రుల విజ్ఞప్తి నేపథ్యంలో పాఠశాలను మళ్ళీ ప్రారంభించినట్లు వారు పేర్కొన్నా రు. కుప్పం నియోజకవర్గం ను విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్ర బాబు నాయుడు కృషి చేస్తున్నారని విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు రానున్నాయని ఎమ్మెల్సీ శ్రీకాంత్ పేర్కొన్నారు.



## నారాలోకేష్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టాక విద్యా విధానాలలో నూతన మార్పులు తీసుకొచ్చి ఫీజు రీయింబర్స్మెంట్ నగదును విద్యార్థుల కళాశాల ఖాతాలలో జమ చేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని గిరిజన నవ సమాజ్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పాలిత్య శివ శంకర్ నాయక్ తెలిపారు. గత ప్రభుత్వ హాయంలో విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లోకి విద్యా దీవెన, వసతి దీవెనల పేరుతో అప్పటి ప్రభుత్వం జమ చేసిందన్నారు. కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు సకాలంలో ఫీజు రీయింబర్స్మెంట్ జరగక యాజమాన్యం నుండి విద్యార్థులు అనేక ఒత్తిళ్లను ఎదుర్కోవాల్సిన పరిస్థితులు వచ్చాయన్నారు. ఆ సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో వ్యయ ప్రయాసలతో అప్పులు తీసుకొచ్చి కళాశాలలకు ఫీజు చెల్లించిన సందర్భాలు ఉన్నాయన్నారు. పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ నగదును కూడా బదలాయింపు చేయాలని విజ్ఞప్తి చేశారు. డిగ్రీ ప్రవేశ పరీక్షల్లో ఆన్లైన్ విధానాన్ని తోసిబుచ్చి ఆఫ్ లైన్ విధానాన్ని కొనసాగించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, అలానే ఎస్సీ ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని మంత్రి నారా లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు.

## రూ.3.21కోట్లకు కూరగాయల మార్కెట్ వేలం

**తిరుపతి నగరం, మేజర్‌న్యూస్:** తిరుపతి నగరంలోని ఇందిరా ప్రియదర్శిని కూరగాయలమార్కెట్‌లో రుసుం వసూలు చేసుకొనుటకు నిర్వహించిన వేలం లో రూ.3కోట్ల 21లక్షలకు గీతా అనే మహిళ దక్కించుకున్నది. తిరుపతి మునిసిపల్ కార్పొ రేషన్ కార్యాలయంలో మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అదితిసింగ్ ఐఏఎస్, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ ఆధ్వర్యంలో గురు వారం ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్లో రుసుం వసూలు చేసుకొనుటకు జరిగిన బహిరంగ వేలంలో జరిగిన పాటలో గీత అనే మహిళా అత్యధికంగ 3 కోట్ల 21 లక్షలు పాట పాడి వేలం దక్కించుకోవడం జరిగింది. అదేవిధంగా గాంధీ రోడ్డు మరి కొన్ని రోడ్లపై పార్కింగ్ రుసుం వసూలు చేసుకొనుటకు జరిగిన బహిరంగ వేలంలో 13లక్షల 5వేల రూపాయాలతో ప్రకాష్ అనే వ్యక్తి పాటను దక్కించుకోవడం జరిగింది. భారతీ బస్టాండ్ పార్కింగ్ రుసుము వసూలు చేసుకొనుటకు 4 లక్షల 75 వేలతో శరత్ బాబు, అదేవిధంగా గోవిందరాజస్వామి మాడావీధుల్లో పార్కింగ్‌రుసుం వసూలు చేసుకొనుటకు 93,200 రూపాయాల తో మునికృష్ణ రెడ్డి వేలంలో దక్కించుకు న్నారు. వేలంలోరుసుం వసూలు చేసుకొనుటకు 8నెలలు అనగా మార్చి 31, 2025 వరకు మాత్రమే అధికారికంగ అనుమతి ఇచ్చినట్లు మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అదితిసింగ్ ఐఏఎస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, ఉప కమిషనర్ అమరయ్య, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, కె.ఎల్. వర్మ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు ఉండాలి

**గూడూరు రూరల్, మేజర్‌న్యూస్:** విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని, నేటి విద్యార్థులే రేపటి పాలకులుగా ఎదగాలని గూడూరు నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్ పేర్కొన్నారు. గురువారం గూడూరు పట్టణంలో శ్రీ షిరిడిసాయి నగర్‌లోని నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థి నాయకులను ఎన్నుకునేందుకు సోషల్ స్టడీస్ ఉపాధ్యాయులు గురుప్రసాద్ ,దామోదర్ ల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య ప్రాధాన్యం వివరిస్తూ పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు సరైన ఉత్తమనాయకులను ఎన్నుకోవడంవల్ల వారి ద్వారా ఉత్తమ అభివృద్ధి ఎలా ఉంటుందోనని తెలుస్తుందన్నారు. విద్యార్థులలో ఉత్తమ నాయకులుగా ఎన్నుకొనే విధంగా విద్యార్థులు ఓటు హక్కును వినియోగించు కొనేలా ప్రోత్సహించారు. ఏజీఎం గురవయ్య మాట్లాడుతూ నేటిబాలలే రేపటి పౌరులగా అలాగే నేటి విద్యార్థులే భావి భారత తీర్చిదిద్దబడుతారని, భవిష్యత్తులో దేశ నాయకులను ఎన్నుకొనేందుకు అవగాహనను నారాయణవిద్యాసంస్థలు కల్పిస్తాయని ఆయన తెలియచేసారు.వారి ప్రోత్సాహంతో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ఓటుహక్కును వినియోగించుకొని నచ్చిన నాయకులను ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ కో ఆర్డినేటర్ రఘురాం, ఏఓ పద్మయ్య ఈ కిడ్స్ కోఆర్డినటర్ పుష్ప, అకడమిక్ డీన్ భవాని, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



## మొబైల్ హంట్‌తో సత్ఫలితాలు

**90 లక్షలు విలువైన 500 మొబైల్ ఫోన్లు రికవరీ**

**బాధితులకు ఫోన్లు అందజేసిన ఎస్పీ**

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** మెరుగైన నైపుణ్యాభివృద్ధి కలిగిన సైబర్ ల్యాబ్ నిపుణులు చేపడుతున్న మొబైల్ హంట్ ద్వారా ఫోన్ బాధితులకు న్యాయం జరుగుతూ సత్ఫలితాలు ఇచ్చిందని జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు తెలిపారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వివిధ ప్రాంతాలలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను బాధితులకు సమాచారం అందించి వారికి అందజేశారు. విలేకరుల సమావేశం లో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ తాము వినియో గిస్తున్న మొబైల్‌ను పోగొట్టుకున్న బాధితుల కు తిరిగి వాటిని వారికి అందజేయడం ఆనందంగా ఉందని తెలిపారు. మెరుగైన నైపుణ్యాభివృద్ధి కలిగిన సైబర్‌ల్యాబ్ నిపుణు లు మొబైల్ హంట్ నెంబర్‌కు 9490617873 వచ్చిన ఫిర్యాదులను వెంటనే దర్యాప్తుచేసి సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులకు అండగా నిలిచారన్నారు. జిల్లా లో ఇప్పటివరకు బాధితులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు 9విడతలుగా రూ.5,45,40,000 విలువైన 3,030 సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి సెల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితులకు జిల్లా ఎస్పీ అందజేశారు. ఇందులో భాగంగా 10వ విడతలో సుమారు రూ.90లక్షల విలువైన 500 మొబైల్ ఫోన్లు బాధితులకు అందజేశామని తెలిపారు. ఇప్పటివరకు మొబైల్ హంట్ ద్వారా 10విడతలలో మొత్తం సుమారు రూ.6,35,40,000 విలువైన 3,530 మొబైల్ ఫోన్లు రికవరీ చేశామన్నారు. రాష్ట్ర డిజిపి సి.ఎచ్. ద్వారక తిరుమలరావు ఆదేశాలపై జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బా రాయుడు, జిల్లా పరిపాలన అదనపు ఎస్పీ వెంకట్రావు పర్యవేక్షణలో సైబర్ క్రైమ్ సి.ఐ. వినోద్ కుమార్ ఆధ్వ ర్యంలో ఒక ప్రత్యేక బృందా న్ని ఏర్పాటు చేసి పోగొట్టుకు న్న మొబైల్స్‌ను రికవరీ చేసి భాదితులకు అందజేస్తున్నా మన్నారు. జిల్లా పోలీస్ యంత్రాంగం మొబైల్ హంట్ యాప్, సీఐ ఈఆర్ పోర్టల్ సేవలు గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని, దీనితోపాటు తమ వంతుగా మీడియా ప్రచారానికి సహకరించాలని కోరారు. ఈ యాప్‌లను జిల్లా ప్రజలే కాకుండా నగరానికి వచ్చే యాత్రికులు కూడా మొబైల్ హంట్, సిఐఈఆర్ పోర్టల్‌ను సద్వినియోగంపై ఆనందం వ్యక్తం చేశారు. సెల్ ఫోన్ రికవరీ లో ప్రతిభ కనబరిచిన సైబర్ క్రైమ్ సిఐ వినోద్ కుమార్, సైబర్ క్రైమ్ సిబ్బందికి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పరిపాలన వెంకటరావు, సైబర్ క్రైమ్ సీఐ వినోద్ కుమార్, సైబర్ క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.





## శ్రీవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

**తిరుమల, మేజర్ న్యూస్:** తిరుమల శ్రీవారిని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దర్శించుకున్నారు. గురువారం ఉదయం స్వామి వారికి పుష్పాలను అలంకరించే తోమాల సేవలో కుటుంబ సమేతంగా పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం నితిన్ గడ్కరీని శ్రీవారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ... దేశం అభివృద్ధి చెందాలి, ఆర్థికంగా మెరుగు పడాలి అని దేవుడిని ప్రార్థించడం జరిగింది అని

## సభ్యత్వం నమోదుతో పార్టీ బలోపేతానికి దోహదం

**- మొదటి సభ్యత్వ నమోదు చేసుకొని క్రియాశీలక సభ్యత్వ నమోదు ప్రారంభం**
**- క్రియాశీలక సభ్యత్వం పొందే ప్రతి ఒక్కరికీ ప్రమాద, జీవిత బీమా**
**- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** జనసేన పార్టీ మరింత బలోపేతం అయ్యేందుకు పార్టీ క్రియాశీలక సభ్యత్వం నమోదు ఎంతగానో దోహదపడుతుందని, జనసేన సైనికులంతా తప్పనిసరిగా క్రియాశీలక సభ్యత్వం నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన నివాసంలో క్రియాశీలక సభ్యత్వాన్ని మొదటగా నమోదు చేసుకుని జనసేన సభ్యత్వ నమోదును ప్రారంభించారు. జనసేన క్రియాశీలక నమోదు ఈనెల 28 వరకు కొనసాగుతుందని, యాభై రెండు యూనిట్లుగా సభ్యత్వ నమోదును చేపట్టినట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. డివిజన్ అధ్యక్షుల పర్యవేక్షణలో సభ్యత్వ నమోదు జరుగుతుందని చెప్పారు. ఒక్కో డివిజన్ లో రెండు వందల మంది క్రియాశీల సభ్యులు చేరేలా టార్గెట్ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. క్రియాశీలక సభ్యత్వం పొందే వాళ్లకు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కల్పించారన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్ వల్ల అనుకోని దుర్ఘటనల్లో కార్యకర్తలు చనిపోతే ఐదు లక్షలు, స్వల్ప గాయాలైతే యాభై వేలు వారి కుటుంబాలకు అందుతుందన్నారు. పదివేల మంది క్రియాశీల సభ్యులను చేర్చడం తమ ముందున్న లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, పొలకల మల్లిఖార్జున్, కిరణ్‌రాయల్, రాజారెడ్డి, రాజేష్ యాదవ్, పగడాల మురళీ, ముక్కుసత్యవంతుడు, ఆముదాల వెంకటేష్, దినేష్‌జైన్, రాజేష్‌చారి, హేమకుమార్, పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరిస్తాం: ఆర్డీవో

**గూడూరురూరల్ మేజర్‌న్యూస్:** ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఆదేశాల మేరకు అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంలో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ఆర్డీఓ కిరణ్‌కుమార్ మున్సిపల్ కమిషనర్, తహశీల్దార్, ఎంపీడీవో, ఇతర అధికారులతో కలిసి ఉదయం 7-00 గంటలకు ఆదిశేషారెడ్డి స్టేడియంకి వచ్చి స్టేడియం లో ఉన్నటువంటి అన్ని రంగాల క్రీడాకారులు, వాకర్స్‌తో కలిసి స్టేడియంలో ఉన్నటువంటి ప్రతి సమస్యని అడిగి తెలుసుకున్నారు ఆర్డీవో మాట్లాడుతూ ఎమ్మెల్యే స్టేడియంలోని ప్రతి సమస్యని పరిష్కరించమని ఆదేశించారని వారి ఆదేశాల మేరకు వెంటనే చేపట్టవలసిన పనులను త్వరగా చేయమని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఎలాంటి ప్రైవేటు కార్యక్రమాలకు స్టేడియం ఇవ్వనని చెప్పడం జరిగింది. స్టేడియంలో నూతన జిమ్ ఏర్పాటు, ప్రహరీ గోడ మరమ్మత్తులు గ్యాలరీ నిర్మాణం, క్రీడాకారులకు శాశ్వత నీటి పరిష్కారం చేయమని వీటన్నిటికీ కూడా ఎస్టిమేషన్స్ తయారు చేయమని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ హాస్పిటల్ కి వెళ్లి అక్కడ ఉన్నటువంటి శానిటేషన్ ఎలా ఉంది వాటర్ ఎక్కడ ఆగుతుంది అనే వివరాలను ఆసుపత్రి సిబ్బందిని అడిగి తెలుసుకుని వాటిని కూడా పరిష్కరించే దిశగా ఆదేశాలు ఇవ్వటం



జరిగింది. ఎమ్మెల్యే సహకారంతో నిధులు సమకూర్చి మిగతా వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పారు. స్టేడియం లో ఉన్నటువంటి సమస్యల పరిష్కారానికి వెంటనే స్పందించినటువంటి ఎమ్మెల్యేకి క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా స్టేడియంకి వచ్చి ప్రతి సమస్యను దగ్గరుండి చూచి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే మాట్లాడి వారి సలహా మేరకు అన్ని సదుపాయాలు సమకూరుస్తామని చెప్పినందుకు క్రీడాకారులు ఎంతో ఆనందంతో ఆర్డీవోకి కూడా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, రజిని, విజయ్, లవకుమార్, దీపక్, మస్తాన్,పురుషోత్తం, సుబ్రహ్మణ్యం, మునీఫ్, సాయి, సుమన్ రెడ్డి, హరి, సేటు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరుడు సేవలో ఏర్పేడు వ్యాసాశ్రమం పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానానికి ఏర్పేడు వ్యాసాశ్రమం పీఠాధిపతి శ్రీ పరిపూర్ణానంద గిరి స్వామి గురువారం శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానానికి విచ్చేశారు. వారిని దేవస్థానం డిఇఓ మల్లికార్జున ప్రసాద్ స్వాగతం పలికి శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి ప్రత్యేక దర్శనం చేయించారు. శ్రీ మృత్యుంజయ స్వామి సన్నిధానం వద్ద శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అధికారి మల్లికార్జున ప్రసాద్ ఏర్పేడు వ్యాసాశ్రమం పీఠాధిపతి పరిపూర్ణానంద గిరి స్వామి వారిని శేష వస్త్రంతో సత్కరించి శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. వేద పండితులు వేదమంత్రాలతో ప్రత్యేకంగా ఆచరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారి మల్లికార్జున ప్రసాద్ ఆలయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

**- తాగునీరు,రోడ్లు,విద్యుత్ వంటి మౌలిక వసతుల పై దృష్టి సారించండి**

**- మండల సమావేశంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం**

**వరదయ్యపాలెం, మేజర్‌న్యూస్:** ప్రజలకు ప్రధాన అవసరాలైన తాగునీరు, రోడ్లు, విద్యుత్ వంటి మౌలిక వసతులు కల్పనపై ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాలని కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. గురువారం వరదయ్యపాలెం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం ద్వారా ప్రజలకి సేవ చేసే భాగ్యాన్ని అధికారులు సద్వినియోగం చేసుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి, మండల ప్రగతికి కృషి చేయాలన్నారు. అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ పడవద్దని, అవినీతికి పాల్పడకుండా నిజాయితీగా పని చేయాలని ఎమ్మెల్యే అధికారులకు హితువు పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను అధికారులు, ప్రజాప్రతినిధులు సభలో గజమాల,శాలువాతో ఘనంగా సన్మానించారు. రైతులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. స్థానిక ఎస్ కే ఎస్ సూపర్ మార్కెట్ వద్ద టిడిపి నేత కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో తక్కువ ధరలకు నిత్యావసర సరుకులు అందజేశారు. టీడీపీ యువజన నాయకుడు అంబురుకు చెందిన ఆణిముత్యం నందకిషోర్ ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ కార్యాలయాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చిత్ర పటాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎన్‌డిఏ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## విద్యకే నా మొదటి ప్రాధాన్యత...

**- గంగాధర్ నెల్లూరు నియోజకవర్గం ఎమ్మెల్యే ఎం వి థామస్**
**- నియోజకవర్గంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పనే నా లక్ష్యం**

**పెనుమూరు, మేజర్‌న్యూస్:** విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎంవి థామస్ విద్యార్థులకు సూచించారు, గురువారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ఎమ్మెల్యేగా నా మొదటి ప్రాధాన్యత విద్య పైనే ఉంటుందని ఆయన అన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యేగా నన్ను గెలిపించిన ప్రతి ఒక్కరికి నేను రుణపడి ఉంటాను అని, అలాగే మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయ సాధన కోసం అహర్నిశలు కృషి చేస్తూ, నేను పుట్టిన నా నియోజకవర్గంలోని యువతకు విద్యార్థులకు నిరుద్యోగులకు నా సహాయ సహకారాలను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. ముఖ్యంగా విద్యార్థులు చదువు పట్ల ఏకాగ్రతతో చదివి తమ భవిష్యత్తును బంగారు భవిష్యత్తుగా మలుచుకోవాలన్నారు. ప్రతి సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో 600కు 600 మార్కులు సాధించిన విద్యార్థికి 1,75,000 నగదు, ఒక బంగారు పతకాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. మన ప్రభుత్వం పేద విద్యార్థుల కు నాణ్యమైన విద్య అందించేందుకు ఉచిత పుస్తకాలు బ్యాగు యూనిఫామ్ వంటి సౌకర్యాలు కల్పిస్తుందని ఆయన తెలిపారు. గంగాధర్ నెల్లూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో నిరుద్యోగులకు ఉపాధి కల్పించ చడమైన లక్ష్యంగా ముందుకు వెళుతున్నాను అని అన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలో లోనే నిరుద్యోగ ఉపాధి కల్పనకై, నియోజకవర్గ అభివృద్ధికై వివిధ రకాల పరిశ్రమంలో తీసుకొచ్చి తద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే నియోజవర్గంలోని ప్రతి ఒక్కరి సహాయ సహకారాలతో ప్రభుత్వ భూములను ఆక్రమ గురైన వాటి వివరాలను తెలియజేస్తే ఆ భూమిని తిరిగి ప్రభుత్వం సాధనం చేసుకుని ఆ భూమిలో పరిశ్రమల ఏర్పాటుకు దోహదపడుతుందని ఆయన తెలిపారు. 30 సంవత్సరాలుగా నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ గెలవలేదని, ప్రజల ఆశీస్సులతో తెలుగుదేశం ప్రభుత్వం అధికారం చేపట్టిందని నియోజక అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తాన్నామన్నారు. నేను ఈ నియోజకవర్గాన్ని దోచుకోవడం కోసం రాలేదని, కక్ష సాధింపులు చర్యలు చేపట్టడం లేదని, నా నియోజకవర్గ లోని పేద ప్రజల కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకే నేను ఎమ్మెల్యేగా వచ్చానని ఆయన అన్నారు. అనంతరం విద్యార్థులకు విద్యా సామాగ్రి కిట్లను పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖ అధికారులు రాజేంద్రన్ ఎం ఈ ఓ 2 భాస్కర్ నాయుడు తహసిల్దార్ సుభద్ర, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఈఓఆర్‌డి మహేశ్వరరావు, జెడ్పిటిసి దొరస్వామి యాదవ్, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, తెలుగుదేశం పార్టీ మాజీ ఎంపీపీ హరిబాబు నాయుడు, మాజీ జడ్పిటిసి రుద్రాయ నాయుడు, కృష్ణమూర్తి నాయుడు, గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి యుగంధర్, కూటమి నాయకులు, మండల శాఖ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పెనుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యా సమాగ్రిని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎంవి థామస్

## ఎస్వీయూ ఇంచార్జి వీసీగా ఆచార్య సీహెచ్ అప్పారావు



**తిరుపతిఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** శ్రీవేంకటే శ్వర విశ్వవిద్యాలయం నూతన ఇన్చార్జి ఉపకులపతిగా ఆచార్య సిహెచ్ అప్పారావు నియమిం చడం జరిగింది. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ మండలి ఉత్తర్వులను జారీ చేసింది. శ్రీవేంకటేశ విశ్వవిద్యాలయంలోని బయోటెక్నాలజీ విభా గానికి చెందిన సీనియర్ ఆచార్యులు, ఎస్వీయూ కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ డీన్, ఫార్మసీ కళా శాల ప్రిన్సిపల్ అప్పారావు నూతన ఇంచార్జ్ ఉపకులపతిగా నియమితుల య్యారు. శుక్రవారం ఉదయం 9:30 గంటలకు ఉప కులపతి చాంబర్లో బాధ్యతలు స్వీక రిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.



**వీసీ సిహెచ్ అప్పారావుకి అభినందనలు :** శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇంచార్జి వీసీగా నియమితులైన సిహెచ్ అప్పారావుకు టిఎన్ఎస్ఎఫ్ నేతలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి దుస్సాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్వీయూలోని సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్, ప్రధాన కార్యదర్శి మైలారి అశోక్, పత్తిపాటి వివేక్, టీచింగ్ అసిస్టెంట్ ప్రెసిడెంట్ రాంబాబు పాల్గొన్నారు.

## ముగిసిన జ్యేష్ఠాభిషేకం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** శ్రీగోవిందరాజస్వామి కవచ సమర్పణతో గురువారం స్వామివారి జ్యేష్ఠాభిషేకం శాస్త్రోక్తంగా ముగిసింది. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం కవచాలను ఊరేగింపు నిర్వహించారు. ఆ తరువాత శతకలశ స్నపనం, మహాశాంతి హెూమం చేపట్టారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి ఉత్సవర్లను కల్యాణమండపంలోకి వేంచేపు





చేసి స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం చేశారు. కవచ ప్రతిష్ట, అక్షతారోహణం నిర్వహించి బ్రహ్మఘోష వినిపించారు. ఆస్థానం నిర్వహించిన తరువాత స్వామి, అమ్మవార్లకు కవచ సమర్పణ చేశారు. సాయంత్రం ఉభయనాంచారులతో కలసి స్వామివారు ఆలయ ప్రధాన వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో శాంతి, ఏఈవో ముని కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు నారాయణ, మోహన్ రావు, టెంపుల్ ఇన్స్పెక్టర్లు ధనంజయులు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

## పోస్ట్ మార్టం భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పులివర్తి నాని

**చంద్రగిరి, మేజర్ న్యూస్:** చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని చేతుల మీదుగా చంద్రగిరి ఏరియా ఆసుపత్రిలో పోస్ట్ మార్టం గదిని ప్రారంభించారు. చంద్రగిరి ఏరియా హాస్పిటల్‌కి చేరుకున్న పులివర్తి నానికి హాస్పిటల్స్ సూపర్డెంట్, డాక్టర్లు శాలువా కప్పి పుష్పగుచ్చం అందించి ఘనంగా ఆహ్వానం పలికారు. మొదటగా వినాయక స్వామికి పూజ చేసి తర్వాత పోస్టుమార్టం గదిని రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. చంద్రగిరికి రెండు వైపులా జాతీయ రహదారులు విస్తరించి ఉండటంతో ఎక్కువ ప్రమాదాలు సంభవిస్తూ ఉంటాయి. మృతుల భౌతిక కాయాలు పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి వైద్య కళాశాలకు



తరలించే పరిస్థితి ఉండేది. మృతులు ఎక్కువగా ఉంటే పోస్ట్ మార్టం ఆలస్యం అయ్యేది. ప్రమాదాల బాధితులు ఎన్నో బాధలను పడుతుండేవారు. చిన్న పాటి గొడవలైన, ప్రమాదాలైనా మెడికో లీగల్ సర్టిఫికెట్లు పొందాలంటే తిరుపతి రుయా ఆస్పత్రికి పోవాల్సిందే. గత ఆరు సంవత్సరాలుగా ఇక్కడి ప్రజల అగచాట్లను చూసిన నేటి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఉన్నతాధికారులతో చర్చించి నిరుపయోగంగా ఉన్న పోస్టుమార్టం గదిని వినియోగంలోకి తీసుకురావడానికి చేసిన కృషి ఫలించింది. ఈ మేరకు గురువారం చంద్రగిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం గదిని ఎమ్మెల్యే పులివర్తి నాని చేతుల మీదుగా ప్రారంభించారు. అదేవిధంగా మెడికో లీగల్ సర్టిఫికెట్లను ఇవ్వటానికి అన్ని విధాల ఏర్పాటు చేశారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భౌతిక కాయాలను తరలించేందుకు ఎంపీ నిధులతో వాహనం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. దీంతో బాధితులకు ఆర్థిక భారం తగ్గటమే కాక సమయాభావం కూడా తగ్గనున్నది. ఎమ్మెల్యే గెలిచిన కొద్ది రోజుల్లోనే పులివర్తి నాని వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, ఆస్పత్రి సూపర్డెంట్ డాక్టర్ అరుణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## బాలికపై లైంగిక దాడి... మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం!

**– రౌడీషీటర్ వినయ్‌పై కఠిన చర్యలుః డిఎస్పి**

**గూడూరు, మేజర్‌న్యూస్:** పట్టణంలో దారుణం చోటుచేసుకుంది. ఇంటర్ చదివే విద్యార్థినిపై రౌడీషీటర్ లైంగిక దాడితో సభ్యసమాజం ఉలిక్కి పడింది. బుధవారం గూడూరు ఒకటవ పట్టణానికి చెందిన విద్యార్థిని (16) కాలేజికి వెళుతున్న సమయంలో బలవంతంగా తీసుకెళ్లి రౌడీ షీటర్ లైంగిక దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. పోలీసుల వివరాల మేరకు కాలేజీకి వెళ్లే విద్యార్థినిని అశోక్‌నగర్‌కు చెందిన రౌడీషీటర్ గుంజుపల్లి వినయ్ కత్తితో బెదిరించి బలవంతంగా ఆటోలో గాంధీ నగర్‌కి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. విష యం ఇంట్లో చెప్పలేక అవమానం తో సూపర్ వాస్మల్ తాగి ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు పేర్కొన్నారు. బాలి కకు మొదట గూడూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స, అనంతరం గూడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం, పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరులోని ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై రెండవ పట్టణ పరిధిలో కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే ఈ ఘటనపై కుటుంబ సభ్యులు మరో రకంగా చెపుతుండడం విశేషం. తమ పిల్లలు ఇద్దరు ఇష్టపడి వివాహం కూడా చేసుకునేందుకు కుటుంబ సభ్యులను ఒప్పించే ప్రయత్నాల్లో ఉండగా కొందరు కావాలనే బాలికను సమాజంలో అబాసుపాలు చేసేందుకు ప్రయత్నం చేసినట్లు పేర్కొంటున్నారు. దీంతో మనస్థాపానికి గురైన బాలిక లైజాల్ తాగి ఆత్మ హత్యాయత్నం చేసినట్లు పేర్కొంటుడం విశేషం. బాలికపై లైంగిక దాడి ఘటనలో రౌడీషీటర్ వినయ్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్పి సూర్యనారా యణరెడ్డి పేర్కొన్నారు. సంఘటనపై ఒకటవ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిందుతుడు పరారీలో ఉన్నాడన్నారు. నిందితుడిని పట్టుకునేందుకు పలువురు సిబ్బందితో రెండు బృందాలు గాలింపు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తెలిపారు.



## కానిస్టేబుల్ తల పగలగొట్టిన బెంగాల్ వాసి

**– కుప్పకూలిన హెడ్ కానిస్టేబుల్ .. నిఘా వైఫల్యం..?**



**గూడూరు, మేజర్‌న్యూస్:** గూడూరు పట్టణంలో చోటు చేసుకున్న సంఘటన ఇతర రాష్ట్రాల వారి వ్యవహార శైలిపై మరోసారి దృష్టి సారించాల్సిన పరిస్థితి నెలకొంది. గురువారం మధ్యాహ్నం పట్టణంలోని సాధుపేట సెంటర్లో గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్ గా పని చేస్తున్న దాసు, మరో కానిస్టేబుల్ టీ తాగేందుకు వెళ్లగా అక్కడ ఉన్న ఒక యువకుడు హెడ్ కానిస్టేబల్‌పై కట్టితో దాడి చేయడం అందరిని ఉలిక్కి పడేలా చేసింది. టీ కొట్టులో ఉన్న సిసి కెమెరాలో నమోదైన వివరాల మేరకు బైకు దిగి నడిచి దుకాణం లోపలికి వస్తుండగా వెనక వైపు నుండి హఠాత్తుగా వచ్చిన బెంగాల్‌కు చెందిన లల్తూ కలిండి అనే 24 ఏళ్ల యువకుడు హెడ్ కానిస్టేబుల్ దాసుపై కర్రతో తలవెనక వైపు కొట్టడంతో తలకు తీవ్ర గాయమై ఒక్కసారిగా అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఇది చూసి వెంటనే మరో కానిస్టేబుల్ స్పందించి స్థానికుల సహకారంతో నిందితుడిని పట్టుకొని ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌కు గాయపడ్డ పోలీసును ఆసుపత్రికి తరలించారు, పోలీసులు ప్రాధమిక విచారణ చేపట్టగా నిందితుడు లల్తూ కలిండి పోలీస్ యూనిఫాం చూస్తే సైకో లా మారిపోతాడని తెలిసి పోలీసులు అవాకయ్యారు. కానిస్టేబుల్ పై జరిగిన దాడి ఘటన మొత్తం అక్కడ ఉన్న సీసీ కెమరా రికార్డులో నమోదయింది. తీవ్రంగా గాయపడిన హెడ్‌కానిస్టేబుల్ దాస్‌ను మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.అయితే ఈ సంఘటనలో పోలీసుల వైఫల్యం ప్రస్పటంగా తెలుస్తోంది. గూడూరు డివిజన్‌లో పారిశ్రామికీకరణ పుంజుకుంటున్న నేపథ్యంలో ఇతర రాష్ట్రాల నుంచి యువతను తీసుకొచ్చి పనులు చేయించు కోవడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే పలు సంఘటనలు చోటుచేసుకుని ఉన్నా వారిపై ప్రత్యేక నిఘా ఉంచడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. చిల్లకూరు, నాయుడుపేట, తడ, ముత్తుకూరు మండలాల్లో పోలీసు రికార్డుల్లోనే పలు అనుమానస్పద మృతి సంఘటనలు నమోదు కావడం దర్యాప్తు కష్టంగా మారి కొన్ని కేసులు మూసి వేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

## వైకాపా భూ కబ్జాదారుల బాగోతం బయటపెడతాం...

**– చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్**

**చిత్తూరు బ్యూరో మేజర్‌న్యూస్:** వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భూకబ్జాలపై ఎవరెవరు ఎంత దోచుకున్నారో మొత్తం కక్కిస్తామని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ స్పష్టం చేశారు. గురువారం చిత్తూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసిపి పాలనలో దాదాపు 1.75 లక్షల ఎకరాల భూ ఆక్రమణలు జరిగాయన్నారు. వీటి విలువ రూ. 35వేల కోట్ల కంటే ఎక్కువగా ఉందన్నారు. అలాగే ఇళ్ల పట్టాల పేరుతో పదివేల ఎకరాలు, ఇసుక దందాల పేరుతో రూ.9750 కోట్లు దోచుకుతిన్నారని అన్నారు, అలాగే జిల్లాలో 782 ఎకరాలు కబ్జా చేశారని తెలిపారు. తిరుపతి, రేణిగుంటలో మఠం భూములు పుంగనూరులో 982 ఎకరాలను కొల్లగొట్టారని పేర్కొన్నారు. తన శ్రీమతి భారతి తన పిల్లలు విలాసవంతమైన బవంతిలో నివసించాలని ఋషికొండలో రూ.500 కోట్ల ప్రజాధనంతో విలాసవంతం అన్న భవంతిని ఏర్పాటు చేసుకోవడం ఆయన పాలనకు అంతేకాకుండా రైతులను దగా చేసే విధంగా వేలాది ఎకరాలను కబ్జా చేసి రైతుల కడుపు కొట్టిన మహెూన్నత దోపిడి ఘనుడు గత సీఎం జగన్మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టాల పేరుతో పదివేల ఎకరాలు కబ్జా చేశారని చెప్పారు. ఇసుక దందాలో రూ.9750 కోట్లు దోచుకున్నారన్నారు. గుజరాత్‌లో లాగా కబ్జాదారులు తామే యజమానులమని నిరూపించుకునేలా చట్టం తీసుకుని వస్తామన్నారు. ఈ భూ అక్రమలపై శ్వేత పత్రాలు విడుదల చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో హౌసింగ్ కాలనీలు ఎక్కడ రావాలో వైసీపీ నేతలే నిర్ణయించే వారిని అన్నారు. రైతుల వద్ద తక్కువ ధరతో భూములను కొనుగోలు చేసి అదే భూములను ప్రభుత్వానికి అధిక ధరలతో అమ్ముకున్న ఘనత కూడా వైకా ప్రభుత్వానికి దక్కిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి జిల్లా కార్యాలయం కోసం 33 ఏళ్ల లీజు పేరుతో 300 కోట్ల విలువైన భూమిని కేటాయించుకున్నారన్నారు. గృహ నిర్మాణానికి సంబంధించి ఆ పేరుతో 98 లక్షల టన్నుల ఇసుక మింగేసార న్నారు.



తమ పార్టీ అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా ఇసుకను ఉచితంగా అందిస్తున్నారని దానిని కూడా వక్రీకరించి ప్రజల్లో అసత్యపు ప్రచారాన్ని చేస్తున్నారని అన్నారు. తమ అధినేత సీఎం చంద్రబాబు నాయుడు ఇసుకను ఉచితంగా అందిస్తానని చెప్పారే గాని ట్రాన్స్పోర్ట్ కు సంబంధించి ఎలాంటి ప్రకటనలు జారీ చేయలేదని ప్రభుత్వ నిబంధనల మేరకు నామమాత్రపు రుసుమును కట్టించుకుని ప్రజలకు ఉచితంగానే ఇసుక ఇస్తున్నారు అన్న విషయాన్ని దుష్టపాలకులు గుర్తు చేసుకోవాలన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు అవినీతికి పాల్పడిన ఎవరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని చట్టపరంగా గత దగాకోరు ప్రభుత్వం చేసిన ప్రతి ఒక్క దందాను బయటకు తీసి తగిన శిక్ష పడే విధంగా చూడడం తప్పదన్నారు. వారి పాలనలో యావత్ రాష్ట్రంలో యువత చెడు దారి పట్టే విధంగా అరాచకాలు పాటుపడారని కూడా గుర్తు చేశారు. తన నియోజకవర్గమైన చిత్తూరులో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు యువత పాల్పడకుండా ఉండేందుకు పోలీసుల సహకారంతో చేపట్టవలసిన చర్యలను కూడా తాను దగ్గరుండి చేపడుతున్నట్లు ఈ సందర్భంగా గురజాల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ మేయర్ కటారి హేమలత. నాయకులు జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌కు శుభాకాంక్షలు



**నాయుడుపేట, మేజర్‌న్యూస్:** తిరుపతి జిల్లా నూతన కలెక్టర్‌గా డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఇటీవల బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ప్రముఖ పారిశ్రామికవేత్త గున్నం సేవాట్రస్ట్ అధినేత తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మధుసూదన్‌రెడ్డి గురువారం కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి కలెక్టర్‌కు శాలువా కప్పి, పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. తమ సేవా ట్రస్ట్ ద్వారా నిర్వహించే సేవా కార్యక్రమాలకు సహకరించాలని కోరారు.

## హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ



**నాయుడుపేట మేజర్‌న్యూస్:** పట్టణంలో గురువారం నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి సంయుక్త, నాయుడుపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డిల ఆధ్వర్యంలో న్యాయవాదులు, పోలీసు శాఖ సంయుక్తంగా హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నాయుడుపేటలోని కోర్టు సముదాయం నుంచి పాత బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి సంయుక్త మాట్లాడుతూ హెల్మెట్ వాడకం యొక్క ఆవశ్యతను గూర్చి వాహనదారులకు అవగాహన కల్పిస్తూ కొన్ని సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేగం కంటే ప్రాణాలు ఎంతో విలువైనవని కనుక ప్రతి వాహనదారుడు హెల్మెట్‌లను తప్పనిసరిగా ఉపయోగించాలని సూచించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ వాహనచోదకులు ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, లేనిచో కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## దక్షిణామూర్తికి అభిషేక పూజలు



**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** చవట గుంట గ్రామంలో వెలసివున్న శ్రీ నందీశ్వరాలయంలో దక్షిణామూర్తికి గురువారం అభిషేక పూజలు చేశారు. దక్షిణామూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. ఆలయ అర్చకులు రవి శర్మ ఉభయదారులకు ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో ఉదయదారులు పేట జయ కుమారి బ్రహ్మానంద రెడ్డిలు పాల్గొన్నారు.

## పేదలకు దుప్పట్లు పంపిణీ



**గూడూరు రూరల్ మేజర్ న్యూస్:** గూడూరు రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో విందూరు రోడ్ మదురెడ్డి కాలనిలోని పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎస్వీ రత్నం చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు, రొటేరియన్ శ్రీకంటి రామ్మోహన్ రావు దాతృత్వంతోవారి తల్లి జయంతినీ పురస్కరించుకొని. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో సీనియర్ రొటీరియన్స్. శ్రీకంటి రామ్మోహనరావు ,ఎల్లసిరి గోపాల్ రెడ్డి , క్లబ్ అధ్యక్షులు నాసిన నాగులు, రొటరియన్స్ సనత్ రెడ్డి, బండి ధనంజయ రెడ్డి, రాఘవరెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, బలరామిరెడ్డి, మందపాటి వాసు. సెక్రెటరీ గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ



**గూడూరు మేజర్‌న్యూస్:** చిల్లకూరు మండలం లింగవరం గ్రామంలో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖా కార్యక్రమం నిర్వహించారు. గురువారం ఉదయం గ్రామ పంచాయతీలో నిర్వహించిన 16వ విడతసామాజిక తనిఖీ గ్రామసభకు సర్పంచ్ సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎస్‌టిఎం కూనయ్య ఆద్వర్యంలో పంచాయతీలో జరిగిన పనులపై గ్రామ సభలో చర్చించారు. ఈ సమావేశంలో ఎస్‌ఆర్‌పి రవిఏపిఎం గిరిబాబు, క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఆర్సికి కుర్చీలు వితరణ




**వెదురుకుప్పం, మేజర్ న్యూస్:** మండలంలోని రెంటాల చేను మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ రేణుకా దేవి వెదురుకుప్పం ఎం ఆర్ సి కి పది కుర్చీలు వితరణగా అందించినట్లు మండల విద్యాధికారులు మహేశ్వర రావు, దామోదరం తెలిపారు. వితరణ చేసిన ప్రధానోపాధ్యాయులు రేణుకా దేవికి ఎమ్మార్సీ తరఫున ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

# క్రియాశీలక సభ్యత్వం- భద్రమైన భవితవ్యం

**- జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి : పార్టీ సమన్వయకర్త డాక్టర్ నరేష్**



**కుప్పం, మేజర్‌న్యూస్:** జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమంను అందరూ సద్వినియోగం చేసుకోవాలని పార్టీ సమన్వయకర్త డాక్టర్ నరేష్ కోరారు.జనసేన పార్టీ 4వ క్రియాశీలక సభ్యత నమోదు కార్యక్రమం కుప్పం జనసేన కార్యాలయంలో గురువారం ఏర్పాటు నిర్వహించారు. మొదట సభ్యత్వంను పార్టీ సమన్వయకర్త డాక్టర్ నరేష్ నమోదు చేసుకొని కార్యక్రమాన్ని మొదలు పెట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది రోజులు పాటు జరిగే ఈ ఉన్నతమైన కార్యక్రమాన్ని ప్రజలు జనసేన కార్యకర్తలు అందరూ కూడా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 18 సంలు నుంచి 60 సం ల వయసు గల వారు నమోదు చేసుకోవడానికి అర్హులు అని తెలిపారు.5లక్షలు భీమా పాలసీలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ముందు చేసుకున్న వారు మళ్లీ రెన్యూవల్ చేసుకోవాలని పిలుపునిచ్చారు.ముఖ్యమంత్రి నియోజకవర్గం కనుక కూటమి నాయకులు మరియు పార్టీ అదిష్టానం సూచనలు మేరకు ముందుకు సాగాలని 50 మంది వాలంటీర్లు నియమిస్తూ వారికి సూచనలు ఇవ్వడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో నియోజవర్గ నాలుగు మండల అధ్యక్షులు వీర మహిళలు వలంటీర్లు పాల్గొన్నారు.

# జర్నలిస్టులను వేధిస్తే సహించం -అక్రమ కేసులపై న్యాయపోరాటం చేస్తాం

**- గూడూరు జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ**

**గూడూరు రూరల్ మేజర్‌న్యూస్:** విలేకరులపై నమోదైన అక్రమ కేసులపై న్యాయ పోరాటం చేస్తామని, జర్నలిస్టులను వేధిస్తే సహించేది లేదని జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ మీజూరు మల్లికార్జున రావు, కన్వీనర్ జీ. బాబూ మోహన్ దాస్ లు తెలిపారు. గురువారం గూడూరు ప్రింట్ మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం తాళమ్మ దేవస్థానం ఆవరణంలో జరిగింది. ఈ సమావేశంలో అసోసియేషన్‌కు అనుబంధంగా జాయింట్ యాక్షన్ కమిటీని ఎన్నుకున్నారు. ఇటీవల కాలంలో గూడూరు ప్రింట్ మీడియా అసోసియేషన్ సభ్యులను లక్ష్యంగా చేసుకుని కొందరు తప్పుడు కేసులు పెట్టించడం, సోషల్ మీడియా ద్వారా వేధించడం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జేఏసీ ఛైర్మన్ మీజూరు మల్లి కార్జున్ రావు మాట్లాడుతూ గూడూరు ప్రింట్ మీడియా అసోసియేషన్ లోని జర్నలిస్టులపై కొందరు ముఠాగా ఏర్పడి అక్రమ కేసులు పెట్టించడం, వేధించడాన్ని తీవ్రంగా ఖండించారు. అటువంటి వ్యక్తులను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. వారి దుశ్చర్యలతో పోలీసులు పెట్టిన అక్రమ కేసులపై న్యాయపోరాటం సాగిస్తామన్నారు. అధికారులు జర్నలిస్టులపై తప్పుదారిపట్టించి అసత్య ఫిర్యాదులు చేసేవారి పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రింట్ మీడియా విలేకరులు ప్రజలకు ప్రభుత్వానికి నడుమ వారధులుగా ఉంటూ నిజాయితీగా విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. జర్నలిస్టులపై కుట్రలు పన్నుతున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమ కేసులు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ జీ. బాబుమోహన్ దాస్ మాట్లాడుతూ కొంతకాలంగా గూడూరు జర్నలిస్టులపై అసత్య ప్రచారాలు చేయడం నకిలీ విలేకరుల ముఠాకు పరిపాటిగా మారిందన్నారు. ప్రజా సంఘాల పేరుతో, జర్నలిజం ముసుగులో సీనియర్ జర్నలిస్టులను వేధించడం, కేసులు పెట్టించడాన్ని జాయింట్ యాక్షన్ కమిటీ తీవ్రంగా పరిగణనలోకి తీసుకుని స్పందిస్తుందన్నారు. సీనియర్ జర్నలిస్టులపై ఆగడాలను నియంత్రించడం కోసం న్యాయపోరాటమే లక్ష్యంగా జాయింట్ యాక్షన్ కమిటీ పనిచేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో గూడూరు ప్రింట్ మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ జమాలుల్లా, ఉడతా శరత్ యాదవ్, గౌరవ సలహాదారులు మనోహర్ రెడ్డి, ఉపాధ్యక్షులు బాలకృష్ణ గౌడ్, జాయింట్ సెక్రటరీ తిరుమలశెట్టి భవానీ, సహాయ కార్యదర్శి తులసీరాజు, కార్యవర్గ సభ్యులు ప్రసాద్, శశి, కిషోర్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



**గూడూరు జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ కార్యవర్గం**

గూడూరు ప్రింట్ మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ అనుబంధంగా గూడూరు జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీ కన్వీనర్‌గా జీ. బాబుమోహన్ దాస్, ఛైర్మ‌న గా మీజూరు మల్లికార్జున రావు, సభ్యులుగా అనిల్ కుమార్ (నాని), నన్నూరు లక్ష్మణ్, డీ. కృపానిధిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలి

**- సీనియర్ సివిల్ కోర్టు జడ్జ్ పగడాల శ్రీనివాసరావు**

**పలమనేరు, మేజర్‌న్యూస్:** ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనాన్ని నడిపే వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలను నడిపి వారి ప్రాణాలను కాపాడుకోవాలని పలమనేరు సీనియర్ సివిల్ కోర్ట్ జడ్జి పగడాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆమెరకు జడ్జ్ ఆదేశాలతో పలమనేరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అక్కడి విద్యార్థులతో న్యాయజ్ఞాన సదస్సులో భాగంగా హెల్మెట్ల పై అవగాహనను కల్పించేందుకు భారీ ర్యాలీను కళాశాల వద్ద నుండి ప్రారంభించి పలు వీధుల గుండా పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు పరమశివప్ప, లక్ష్మీపతి, బర్కత్, షరీఫ్, ఏజీపీ కృష్ణమూర్తి, సయ్యద్ ఇస్మాయిల్,చంద్రశేఖర్, మోహన్ రెడ్డిలతోపాటు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కన్నయ్య, ఏఎస్ఐ రమేష్‌లు మాట్లాడుతూ వాహనాన్ని నడిపే ప్రతి ఒక్కరు వారి క్షేమం కోసం హెల్మెట్లు ధరించాలన్నారు. హెల్మెట్ ధరించకుండా ప్రయాణించడం వల్ల ఏదేని రోడ్డు ప్రమాదాలు జరిగితే తలకు తీవ్ర గాయాలుపాలై మృతి చెందే అవకాశం ఉంటుందన్నారు. ఇందులో ప్రధానంగా విద్యార్థులు హై స్పీడ్ తో వాహనాలను నడపడం వల్ల ప్రాణహాని జరిగే అవకాశాలు ఎక్కువ స్థాయిలో ఉందన్నారు. ఇప్పటికే ఎన్నో ప్రమాదాలలో యువత మృత్యువాత పడ్డ సంఘటనలు చోటు చేసుకున్న విషయం అందరికీ తెలిసిందే అన్నారు.కాగా ప్రతి ఒక్క తల్లిదండ్రులు 18 సంవత్సరాలు పైబడిన పిల్లలకు మాత్రమే వాహనాలను నడపడానికి ఇవ్వాలి. తప్ప తక్కువ వయస్సు ఉన్న వారికి వాహనాలను నడిపేందుకు ఇవ్వడంతో ఏదైనా ప్రమాదం జరిగితే హెల్మెట్,లైసెన్స్,ఆర్ సి లేకుండా వాహనాలు నడిపినందుకు అలాగే ప్రమాదానికి కారణమైనందుకు సంబంధిత తల్లిదండ్రులపై చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు.లైసెన్స్ లేకుండా వాహనాని నడిపే ప్రమాదాలకు గురి చేస్తే ఇన్సూరెన్స్ కూడా వచ్చే అవకాశం లేదన్నారు. ఇప్పటికే ఎంతోమంది హెల్మెట్లు ధరించకుండా నిర్లక్ష్యంగా వాహనా నడిపి మృతి వాత పడ్డారన్నారు. ఇకనైనా వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ లను ధరించి సక్రమంగా లైసెన్స్ తో పాటు వాహనానికి సంబంధించిన ఆర్ సి రికార్డులను తమ వద్ద ఉంచుకొవాలన్నారు.అధిక వేగంతో నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రస్తుతం ఈ వాహనాలను రోడ్డుపై నడిపే విషయంలో ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకొవడం జరిగిందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి జూలై 1వ తేదీ నుండి రూ 10,వేలు చొప్పున జరిమానాలు వేసిన సంఘటనలు ఉన్నాయన్నారు. ఇదే విధంగా లైసెన్స్ లేకుండా హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే మరిన్ని భారీ జరీమానాలు తప్పక చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పలమనేరు కోర్టు సిబ్బంది. న్యాయవాదులు, జూనియర్ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## కత్తెరపల్లి బీసీ సంక్షేమ హాస్టల్ తనిఖీ

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** మండలం లోని కత్తెరపల్లి పంచాయతీలో ఉన్న సంక్షేమ హాస్టల్ ను మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారుని భువనేశ్వరి తనిఖీ నిర్వహించారు. సందర్భంగా హాస్టల్లో తనిఖీ చేసి అక్కడ పిల్లలకు ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే బాత్రూంలు, వంటగది, తాగునీటి ట్యాంక్ పరిశీలించారు. పిల్లలకు ఆరోగ్యం పట్ల అవగాహన సలహా సూచనలు ఇచ్చారు. అలాగే పిల్లలకు హెల్త్ ఎడ్యుకేషన్ లో ముఖ్యంగా హ్యాండ్ వాష్ చేసుకోవాలని ప్రతిరోజు కూడా వాళ్ళు పర్సనల్ హైజింగ్ పాటించాలనేసి వారికి ఆహార నియమాలు న్యూట్రిషన్ ఫుడ్ గురించి తెలిపి వ్యాధులు వాటి నివారణ గురించి కల్తీ ఎడ్యుకేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి వార్డెన్ కుప్ప స్వామి యాదవ్, పిహెచ్ఎన్ గౌరీ ఎంపీహెచ్ఎస్ త్యాగు, వైద్య సిబ్బంది, హాస్టల్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే థామస్‌కు సన్మానం



**కార్వేటి నగరం, మేజర్‌న్యూస్:** కార్వేటి నగరం మేజర్ పంచాయతీలో ఉన్న గాండ్ల సంఘం మండల నాయకులు అధ్య క్షులు మోహన్‌శెట్టి, కార్యదర్శి బాలాజీ సంఘ సభ్యులు పుత్తూరులో ఉన్న తన ని వాసంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురునాథ్, యుగంధర్ తిరు మలేశం, తెలుగుదేశం పార్టీ బీసీ సంఘం నాయకులు రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమం

**- జనసేన పార్టీ ఇంచార్జ్ కోట వినుత చంద్రబాబు**

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జనసేన పార్టీ ప్రారంభించిన క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గురు వారం శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జనసేన పార్టీ ఇంఛార్జి వినుత కోటా పట్టణం పార్టీ కార్యాలయంలో క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. నియోజకవర్గం లో సభ్యత్వ నమోదు వాలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరూ జూలై 18 నుండి 28 వరకు బాధ్యతగా తీసుకుని కష్టపడి పని చేయాలని సూచించారు. కష్టపడ్డ ప్రతి ఒక్క కార్యకర్తకి పార్టీ అధిష్టానం వద్ద నేరుగా గుర్తింపు వచ్చే కార్యక్రమంను క్షేత్ర స్థాయి కార్యకర్తలు ఉపయోగించుకోవాలని కోరారు. పార్టీ అధికారంలో ఉండటంతో ఉస్తాహంగా పండుగ వాతావరణంలో సభ్యత్వ నమోదు చేసి జిల్లా లోనే అధిక సభ్యత్వాలు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమం అనంతరం నాయకులు, జనసైనికులు, వీరమహిళలు సభ్యత్వ నమోదు చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోనే మొట్ట మొదటి రాజకీయ పార్టీ కార్యకర్తల క్షేమం ఆలోచించి ప్రమాద భీమా 5 లక్షలు, ఏక్సిడెంటల్ భీమా 50 వేలు అందిస్తున్నది జనసేన పార్టీ, పవన్ కళ్యాణ్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్ సభ్యులు, మండల అధ్యక్షులు , నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని కలిసిన - ఎంజీ రెడ్డి

**రేణిగుంట, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బొజ్జల సుదీర్ రెడ్డిని కలిసిన రేణిగుంట పంచా యతీ వార్డు సభ్యులు ఎంజీ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు మునీర్, మాజీ సర్పంచ్ జ్యోతి నారాయణ కార్యకర్తలు. గురు వారం ఊరందూరిలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వ కంగా కలిశారు. అనంతరం పంచాయతీలో ప్రజలకు కావా ల్సిన సౌకర్యాలు, అవసరాలపై ఎమ్మెల్యే అదృష్టం తీసుకె ళ్లారు. వీటితోపాటుగా పట్టణంలో పలు ప్రాంతాలలో కొంత మేర నీటి సమస్య ఉంది అని దీన్ని పూర్తి స్థాయిలో చర్యలూ చేపట్టాలని అలాగే పట్టణంలో పంచాయితీ స్థలాలు భూ కబ్జాకు పాల్పడ్డ వాటిపై చర్యలు తీసుకోవాలని, కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రెడ్డి సంఘం అధ్యక్షుడు అమర్నాథ్ రెడ్డి, సాగర్, నరసింహులు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



## ఎలక్ట్రో స్టీల్ క్యాస్టింగ్ ల్యాంకో కంపెనీనిలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే

**శ్రీకాళహస్తి రూరల్, మేజర్‌న్యూస్:** ల్యాంకో యాజమాన్యం ఆహ్వానం మేరకు కంపెనీ 25 సంవత్సరాలనుండి ఎంతో అభివృద్ధి చెందిన సందర్భంగా ఎంప్లాయిస్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. కంపెనీ ప్రముఖులు మాట్లాడుతూ బొజ్జల గోపాలకృష్ణ రెడ్డి ఎంతో విశ్వాసనీయత కలిగిన నేత అని కంపెనీ అభివృద్ధి ఎంతో సహాయం చేసారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ నాన్న లాగే నేను కూడా కంపెనీ అభివృద్ధికి కృషి చేస్తానని రాబోయే రోజుల్లో కంపెనీ ఇంకా అభివృద్ధి చెంది స్థానిక యువత కి ఉపాధి కల్పించాలని కోరారు.



# కార్పొరేట్ కళాశాలల దందాను ఆపాలి

**- విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్న కళాశాలాలు**
**- ర్యాంకుల పేరుతో విద్యార్థులపై ఒత్తిడి**
**- ప్రత్యేక తరగతుల పేరుతో ఇబ్బంది పెడుతున్నారని విద్యార్థుల ఆవేదన**
**- ప్రైవేటు హాస్టల్స్ దందాను అధికారులు అడ్డుకోవాలి**
**- నిబంధనలు పాటించని కళాశాలలను సీజ్ చేయండి**
**- విద్యార్థుల జీవితాలును కాపాడాలని ఆర్ఐఓ ఎస్ఎఫ్ఐ వినతి**

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** జిల్లా లోని కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలో అనేక అక్రమాలు జరుగుతున్నాయిని, వాటిలో ఇంటర్ బోర్డు నియమ, నిబంధనలు పాటించని కళాశాలలను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి లు అక్బర్, భగత్ రవి డిమాండ్ చేశారు. ఒకవైపు విద్యార్థుల వద్ద అక్రమ ఫీజులు వసూళ్లు మరో వైపు ప్రత్యేక తరగతులు పేరుతో మానసికంగా హింసిస్తున్నారని భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం ఎస్ఎఫ్ఐ నాయకులు ఆర్ఐఓ కి వినతి ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని కార్పొరేట్ ప్రైవేటు కళాశాలలో పిల్లల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజుల వసూళ్లకు పాల్పడుతూ దోచుకుంటున్నారన్నారు. ఇంటర్ బోర్డు నియమ నిబంధనలు పాటించకుండా వ్యవహరిస్తున్నారని, వీటిని గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనుమతి లేకుండా ప్రైవేట్ గా రెసిడెంట్స్ నడుపుతూ లక్షల ఫీజులు వసూలు చేస్తున్నారని, హాస్టల్ లో విద్యార్థులకు ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ర్యాంక్స్ పేరిట ఇబ్బంది పెడుతున్నారని, ఇలాంటివి ఇలాగే కొనసాగితే విద్యార్థులు మానసిక ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలుకు దారి తీసే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇలాంటి వాటిని వెంటనే అధికారులు గుర్తించి కళాశాలలో పై చర్యలు



తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక్క తిరుపతి నగరం లోనే కార్పొరేట్ విద్యా సంస్థ లలో ప్రత్యేక తరగతి అంటూ సెలవులు లేకుండా, ఆదివారాలు లేకుండా ప్రతిరోజూ విద్యార్థులను ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రత్యేక తరగతులతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాసంస్థలు పెట్టే టార్చర్ ను విద్యార్థులు తట్టుకోలేక మానసిక ఒత్తిడి సెలవులు ఇప్పించాలని విద్యార్థి సంఘాలను వేడుకుంటున్నారన్నారు. ఇలాంటివన్నీ దృష్టిలో పెట్టుకొని ఇప్పటికైనా ఇలాంటి కళాశాలలకు నోటీసులు ఇచ్చి హెచ్చరించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల జీవితాలు కాపాడాలనిఆర్ఐ ఓను కోరారు. ఇంటర్ బోర్డు నియమాలు ప్రకారం సెలవులు రోజుల్లో తరగతులు నిర్వహించరాదని ఉన్న నిబంధనలను తుంగలో తొక్కి ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రైవేట్ హాస్టల్ లో ఉన్న విద్యార్థులకు ఆదివారం యోగ, ఆటలు, కల్చరల్ ప్రోగ్రామ్ నిర్వహించాలని నిబంధనలు ఉన్న అవేవీ పట్టించకుండా కార్పొరేట్ కళాశాలలో వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. బోర్డు నియమ, నిబంధన లు పాటించని కళాశాల లను సీజ్ చేసి విద్యార్థుల జీవితాలును కాపాడాలి అని కోరారు. ఆర్ఐఓ స్పందించి కచ్చితంగా బోర్డు నిబంధనలు పాటించని కళాశాల లపై చర్యలు తీసుకుంటాం అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వినోద్, తేజ పాల్గొన్నారు.

# నిజమైన కార్యకర్తలకు గుర్తింపు లేదు

**- టిడిపి నాయకులు నగిరి రామానుజం చలపతి**

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** తెలుగుదేశం పార్టీ కోసం నిరంతరం శ్రమించే కార్యకర్తలు ఎవరో తెలుగుదేశం పార్టీ ముసుగులో సొంత లాభం చేసుకునే దోపిడి దొంగలు ఎవరో అన్న నిజం తెలుసుకో చంద్రన్న అంటూ నగిరి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రామానుజం చలపతి అన్నారు. గురువారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1997 సంవత్సరం నుండి 2024 సార్వత్రిక ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తెలుపులో కీలక పాత్ర పోషించి నేటి వరకు గత 27 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీ కోసం జెండాను భుజంపై మోసి పార్టీ అధినాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబును గుండెల్లో మోస్తున్న తమకు నగరి తెలుగుదేశం పార్టీలో అడుగడుగునా అవమానాలు ఎదురు కావడం చాలా బాధాకరం అని అన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారు ఎవరో అని తెలుసుకునే ఉద్దేశంతో రాష్ట్ర పార్టీ కార్యాలయం నుండి వచ్చే వచ్చే సందేశంలో కూడా ఓ పథకం ప్రకారం తమ పేర్లు లేకుండా చేయడం చాలా నీచమైన చర్యని చలపతి అన్నారు. నగరి తెలుగుదేశం పార్టీలో జరుగుతున్న అన్యాయాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి లోకేష్ తెలుసుకొని పార్టీ కోసం నిరంతరంగా శ్రమించే తమలాంటి వారికి న్యాయం చేయాలని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ మీడియా సమావేశంలో తెలుగుదేశం నాయకులు లతా అలిమేలు ఆదెమ్మ కన్నెమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు రామానుజం చలపతి, తదితరులు

## బొజ్జా రెడ్డిపై హత్యాయత్నం... పాత గుంటలో ఉద్రిక్తత

**వెదురుకుప్పం, మేజర్ న్యూస్:** ఇంటి స్థలాల మధ్య వివాదం నేపథ్యంలో పాత గుంటకు చెందిన బొజ్జా రెడ్డి పై ఓ వ్యక్తి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల వివరాల మేరకు మండలంలోని పాత గుంటలో సర్పంచ్ మామ అయిన బొజ్జా రెడ్డి కి అదే గ్రామానికి చెందిన మునేంద్ర (32)కు ఇంటి స్థలాల మధ్య కొన్ని నెలలుగా వివాదం ఉంది. మునేంద్ర తాను ఆక్రమించుకున్న ఇంటి స్థలాలను తనకే కేటాయించాలని బొజ్జా రెడ్డి పై ఒత్తిడి తెచ్చాడు. దీనికి బొజ్జ రెడ్డి అడ్డు చెప్పడంతో మునేంద్ర కక్షపెంచుకుని ఎలాగైనా బొజ్జారెడ్డిని అంతం చేయాలన్న పన్నాగం పన్నాడు. గురువారం పాత గుంటలో ఓ వ్యక్తి మృతి చెందడంతో బొజ్జ రెడ్డి దహన క్రియల్లో పాల్గొన్నారు. ఇదే అదునుగా భావించిన మునీంద్ర పథకం ప్రకారం తన వెంట తెచ్చుకున్న కత్తితో బొజ్జా రెడ్డి పై దాడికి పాల్పడ్డాడు. నిందితుడు మునీంద్ర పలుమార్లు బొజ్జా రెడ్డి పై కత్తితో నరికే ప్రయత్నం చేశాడు. ఇంతలో అక్కడే ఉన్న గ్రామస్తులు అతనిని పట్టుకునే ప్రయత్నం చేయడంతో నిందితుడు పరారైనట్లు చెప్పారు. దాడిలో గాయపడిన బొజ్జ రెడ్డిని తిరుపతి వైద్యశాలకు గ్రామస్తులు తరలించారు. బొజ్జా రెడ్డికి చెయ్యి, మెడ మీదుగా పెద్ద గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. బొజ్జ రెడ్డి పై హత్యాయత్నం జరిగిన విషయం తెలుసుకున్న పలువురు నిందితుడి ఇల్లును ధ్వంసం చేసే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. జరిగిన విషయంపై వెదురుకుప్పం పోలీసులు పాత గుంటలో విచారణ చేపట్టారు. పాత గుంటలో ఉద్రిక్త వాతావరణం నెలకొనే పరిస్థితి ఏర్పడింది. రాత్రులందు పికెటింగ్ ప్రకటించే అవకాశం ఉందని పలువురు తెలిపారు ఇరువురు వైసిపి సానుభూతి పరులని తెలిసింది.



నిందితుడి ఇల్లును పాక్షికంగా ధ్వంసం చేసిన దృశ్యం

## ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం ప్రోత్సాహం

**రామకుప్పం మేజర్‌న్యూస్:** ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ప్రభుత్వం అన్ని రకాల ప్రోత్సాహకాలు అందిస్తుందని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మున స్వామి, బీసీ సెల్ కార్యనిర్వహక కార్యదర్శి పట్రా నారాయణా చారి, పార్టీ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆనంద రెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ అంజినేయరెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విశ్వనాథ్ వెంకటాచలం తెలిపారు. గురువారం మండల సచివాలయం లో ప్రకృతి వ్యవసాయం చేసే ఎస్సీ రైతులకు ఉచిత టార్పాలిన్ పట్టలు, డ్రమ్ములు వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం వల్ల భూసారం తగ్గిపోవడమే కాకుండా, ఏ విధంగా సాగు చేసిన వ్యవసాయోత్పత్తుల వాడకం వల్ల ఆరోగ్యానికి సైతం హానికరంగా ఉంటాయన్నారు. ప్రతి రైతు కూడా ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని సూచించారు.

# ఎడ్యుకేషనల్ హబ్‌గా కుప్పం

**నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషి**

**జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్**



**కుప్పం, మేజర్‌న్యూస్:** కుప్పంను ఎడ్యుకేషనల్ హబ్‌గా తయారు చేయడానికి చర్యలు చేపట్టడం జరుగుతున్నదని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం కుప్పం ఎంపిడిఓ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలో ప్రజా వినతుల స్వీకరణ పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, కడా ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్,డ్వామా పీడీ ఎన్.రాజశేఖర్, కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కుప్పంను ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దే చర్యలు చేపట్టడం జరిగిందని, ఇందులో భాగంగా కేంద్రీయ విద్యాలయం స్థాపనకు, కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు అవసరమైన భూమిని పరిశీలించడం జరుగుతున్నదన్నారు. కుప్పం నియోజకవర్గ పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి స్థానికంగా ప్రజా వినతుల స్వీకరణ పరిష్కారం కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కార్యక్రమం ద్వారా ప్రధానంగా రెవిన్యూ సమస్యలకు సంబంధించి వినతులు అందుతున్నాయని, వీటితో పాటు సామాజిక పెన్షన్, గృహ నిర్మాణం, మౌలిక వసతుల కల్పన, తదితర సమస్యలకు సంబంధించి వినతులు వస్తున్నాయన్నారు. ఈ వినతులను 15 రోజులు గడువులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారంలో ప్రగతిని సమీక్షించడం జరుగుతుందన్నారు. మండల, డివిజన్ పరిధిలో పరిష్కారమయ్యే సమస్యలను ఆయా స్థాయిలోనే పరిష్కరించడం జరుగుతుందని, మండల, డివిజన్ స్థాయిలో పరిష్కారం కానివి జిల్లా స్థాయిలో పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రతి 15 రోజులకొక సారి కుప్పం నియోజకవర్గంలో పర్యటించి సమస్యలపై సమీక్షించడం జరుగుతుందని, రానున్న 6నెలల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ, హౌసింగ్ పిడి తులసి, పద్మనాభం, నాయకులు మునిరత్నం, డా.సురేష్ నియోజకవర్గ, మండల అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకం లక్ష్యాలను సాధించాలి: కలెక్టర్



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** 2024-25 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాల మేరకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను ప్రణాళికా బద్ధంగా సాధించాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ డ్వామా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డ్వామా పథక సంచాలకులు శ్రీనివాస ప్రసాద్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్లతో కలెక్టర్ సదరు శాఖకు చెందిన విధులు, లక్ష్యాలపై సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరానికి గాను లేబర్ కు ఒక కోటి 12 లక్షలు పని దినాలు కల్పించాలన్నారు. ఒక నెలలోపు లక్షా డెబ్బై ఎనిమిది వేల కుటుంబాలు జాతీయ ఉపాధి హామీ ఉపాధి హామీ పథకం పనికి నమోదయ్యేల చర్యలు చేపట్టాలని సూచించారు. సదరు పని చేసిన లేబర్‌కు సరాసరి వేతనం రూ.290కి తగ్గకుండా చూడాలన్నారు. అమృత్ సరోవర్ కేంద్ర ప్రభుత్వ పథకం కింద చెరువుల అభివృద్ధిలో లక్ష్యాల మేరకు పురోగతి సాధించాలని సూచించారు. ఎన్ఆర్ఈజిఎస్ పథకం కింద ప్రాధాన్యతా క్రమంలో పనులను గుర్తించి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# ఇరిగేషన్ శాఖపై ఎమ్మెల్యే సమీక్ష



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి పట్టణం పంచాయతీరాజ్ అతిథి గృహంలో శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇరిగేషన్‌శాఖపై సమీక్ష సమావేశం ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి నిర్వహించారు. రాబోయే వర్షాకాలంలో గ్రామాలలో గల చెరువుల రక్షణకు ప్రణాళికలు రూపొందించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. చెరువు కట్టల అభివృద్ధికి ప్రణాళికల రూపొందించాలని కోరారు. మల్లెమడుగు, ఎస్ఎస్.కెనాల్, బాలాజీ రిజర్వాయర్ల ప్రస్తుత పరిస్థితి భవిష్యత్తులో త్వరతగాతిన వాటిని పూర్తి చేయగలిగే ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు.

## తిరుమలలోని హెూటళ్ళలో

# టీటీడీ ఈఓ, ఫుడ్ సెఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు

**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమలలోని హెూటళ్లలో టీటీడీ ఈఓ శ్యామలరావు, ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కౌస్తుభంలోని బాలాజీ రెస్టారెంట్ లో భక్తులకు అందిస్తున్న ఆహారాన్ని, నాణ్యతను తనిఖీ చేశారు. నిల్వ ఉంచి పాడై పోయిన ఆహార పదార్థాలను ఈఓ, ఫుడ్ సెఫ్టీ అధికారులు గుర్తించారు. నాణ్యత లేని ఆహారం, పాడైన పదార్థాలను భక్తులకు అందిస్తున్నట్లు తనిఖీలలో తేటతెల్లం అయ్యింది.



తనిఖీల అనంతరం ఈవో జె శ్యామలరావు మీడియాతో మాట్లాడుతూ తిరుమలలో పెద్ద హెూటళ్ళుకి టిటిడి అనుమతి ఇచ్చిందని తెలిపిన ఆయన నాణ్యమైన ఆహారం అందించాల్సిన హెూటల్స్‌లో నాణ్యత లేని ఆహారం అంది స్తున్నారని స్పష్టం చేశారు. కౌస్తుభంలో ఉన్న బాలాజీ హెూటల్లో ఆహారం దారు ణంగా ఉందన్నారు. ఫుడ్ స్యాంపుల్స్‌ను ల్యాబ్‌కి పంపి పరీక్షలు నిర్వహిస్తున్నామని రిపోర్ట్ రాగానే చర్యలు తీసుకొంటామని తెలిపారు. అనంతరం ఫుడ్ సేఫ్టీ అథారిటీ డైరెక్టర్ పూర్ణచంద్ర మాట్లాడుతూ పాడై పోయిన పదార్థాలను భక్తులకు అందిస్తున్నారని తెలిపారు. నిషేధంలో ఉన్న ఫుడ్ కలర్స్ ఆహారంలో వాడుతున్నారని స్పష్టం చేశారు. వంట తయారు చేసే కిచెన్ అపరిశుభ్రంగా ఉన్నాయని చెప్పిన ఆయన పిడిఎస్ రైస్ వాడకూడదని తెలిసిన వాడుతున్నారన్నారు. ముందు రోజు మిగిలిన అన్నాన్ని కూడా నిల్వ ఉంచి మరుసటి రోజు వాడుతున్నారని నిర్ధారించారు. ఎఫ్ఎస్ఎస్ఏ చట్టం ప్రకారం చర్యలు తీసుకొంటామని స్పష్టం చేశారు. తిరుమలలో హెూటళ్లపై నిత్యం రైడ్స్ జరుగుతుందని హెచ్చరించారు. లైసెన్స్‌లేకుండా వ్యాపారాలు చేసే వారిపై చర్యలు తప్పవన్నారు. రిపోర్ట్ వచ్చాకా హెూటల్‌ను మూసి వేస్తామన్నారు.

# మంచినీళ్ళగుంటను పునరుద్ధరిస్తాం

**ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** మంచినీళ్లు గుంటను పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులో తెచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్పష్టం చేశారు. గురువారం ఎన్డీఏ కూటమి, నాయకులు, జనసేన, వైసిపి కార్పొరేటర్లుతో కలిసి కలుషితంగా మారిన మంచినీళ్లగుంటను పరిశీలించారు. గోవిందరాజ స్వామి ఆలయంకు నిత్యం నీళ్ళు తీసుకెళ్లే మంచినీళ్ళగుంట కలుషితానికి రుయా, స్విమ్స్ ఆస్పత్రుల నుంచి వచ్చే మెడికల్ వేస్టేజ్ మున్సిపల్ డ్రైనేజీలో కలువకుండా భూమిలో ఇంకిపోవడమే కారణమని కార్పోరేటర్ నరసింహాచ్చారి ఎమ్మెల్యేకు వివరించారు. మంచినీటిగుంట చుట్టూ కలుపు మొక్కలు పెరిగిపోవడంతోపాటు అపరిశుభ్రంగా ఉండటం పట్ల ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. శ్రీరంగం నుంచి తెచ్చిన గోవిందరాజస్వామికి టిటిడి వారంలో ఒక రోజు పూజలు నిర్వహిస్తున్నట్లు కార్పోరేటర్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అలాగే కర్మకాండలు నిర్వహించుకునే పాతగదిఇరుకుగా ఉందని కొత్తది టెండర్ ప్రక్రియ పూర్తయినా పనులు మొదలు పెట్టకపోవడంతో స్థానికులు ఇబ్బందులుపడుతున్న తీరును కార్పోరేటర్లు తెలిపారు. మంచినీళ్ళగుంటకు వెళ్ళే మార్గంలో రోడ్డుపైనే చెత్త, ఇతర వ్యర్థాలు వేస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతుండటంతో డస్టబిన్స్ ఏర్పాటు చేయాలని కార్పోరేటర్లు కోరారు. మంచినీళ్ళగుంటను మంచినీటి గుంటగానే ఉంచేలా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. యాభై వేల మందికి తాగునీరు అందించే మంచినీళ్ళగుంట పునర్ధరణకు గత ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. రుయా, స్విమ్స్ మెడికల్ వ్యర్థాలను మున్సిపల్ డ్రైనేజీ కాలువలో కలిపేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కలుషిత నీటిని శుద్ధి చేయించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. టిటిడి ఈఓ, కార్పోరేషన్ కమిషనర్లతో చర్చించి మంచినీళ్ళగుంటను పునరుద్ధరిస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు నరసింహ ఆచ్చారి, సికె రేవతి, కల్పనా యాదవ్, దుద్దు శివ, ఆదిలక్ష్మీ, బసవ గీత, మాజీ కౌన్సిలర్ జేడబ్లూ విజయ్ కుమార్, టిడిపి నాయకులు మునికృష్ణ, కట్టా జయరామ్, నైనార్ శ్రీనివాస్, బిజేపి నాయకులు అజయ్ కుమార్, వరప్రసాద్, పొనగంటి భాస్కర్, జనసేన నాయకులు వెంకటేశ్వర్లు, సికె రవి, యాదవకృష్ణ, ఆర్కాట్ క్రిష్ణప్రసాద్, పూర్ణ, జలగం శ్రీనివాస్ పాల్గొన్నారు.



జనం కోసమే సూర్య

మీ అభిప్రాయాలే మా కథనాలు

నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గదర్శకులు. ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం. మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్తంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.

కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232

ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116

## ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులే కాదు ప్రజలు సహకరించాలి



**పలమనేరు, మేజర్ న్యూస్:** ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులే కాదు ప్రజలు కూడా సహకారం అందించాలని జాతీయ మానవ హక్కుల సంస్థ బృందం ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఆ సంస్థ జిల్లా నాయకులు డి.వి. మునిరత్నం, వేలయుధం మాట్లాడుతూ... పట్టణంలో రోజురోజుకు ట్రాఫిక్ పెరిగిపోతున్న నేపథ్యంలో వాటిని నియంత్రించడానికి పోలీసులు ఎండనక ,వాననక చేస్తున్న ప్రయ త్నాన్ని నిత్యం మనం చూస్తూనే ఉన్నాము. అయినా వాహనాలు విపరీతంగా పెరగడం తో వారికి కంట్రోల్ చేయడం కొన్ని సంద ర్భాల్లో అసాధ్యమౌతున్న విషయం మనం కళ్లారా చూస్తున్నాం. ప్రజలు కూడా మంచి మనసుతో ట్రాఫిక్ నియంత్రణకు సూచనలను పాటించి పోలీసులకు సహకరిస్తే బాగుంటుందని కోరుకుంటున్నాము. పెరిగిన ట్రాఫిక్ ను దృష్టిలో పెట్టుకొని గతంలో పోలీసు వారు పలమనేరు పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు సూచిస్తూ పార్కింగ్, నో పార్కింగ్ బోర్డులను ఏర్పాటు చేసినప్పటికీ ప్రజలు నిబంధనలను పక్కనపెట్టి నో పార్కింగ్ బోర్డులు ఉన్న పక్కనే వాహనాలను నిలబెట్టి ట్రాఫిక్కుకు అంతరాయం కలిగిస్తున్నది మనమే అని ఆత్మ పరిశీలన చేసుకోవాల్సింది ఎంతైనా ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. బజారు వీధి, జవిళి వీధి, మారెమ్మ గుడి వీధి ప్రాంతాలలో వ్యాపార, వాణిజ్య సముదాయాలు, బ్యాంకులు ఉండడం వలన ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి వ్యాపారం, లావాదేవీలు నిర్వహిస్తుంటారు. అలాంటప్పుడు వాహనదారులు సమన్వయం పాటించి వాహనాలు రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేయకుండా ఒక్క వైపు పార్కింగ్ చేస్తే ప్రజలకు ట్రాఫిక్కుకు అంతరాయం కలగకుండా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. పోలీసులకు సహకారం అందిద్దాం,ట్రాఫిక్కును నియంత్రించుకుందాం. సమాజం మారాలని మనం కోరుకోవడం కాదు మార్పు మనతోనే మొదలైతే సమాజం అదే మారుతుందని ఆశిస్తున్నాము.

## జిల్లా ప్రధాన కార్యదర్శిగా వి. సంజీవ్ కుమార్, ఉపాధ్యక్షులుగా పి.లోకేష్‌కుమార్ ఏకగ్రీవ ఎన్నిక



**పలమనేరు, మేజర్ న్యూస్:** ఉమ్మడి చిత్తూరు జిల్లాల మార్కెట్ కమిటీ ఉద్యోగస్తుల సంఘం ఏఎంసీ ప్రధాన కార్యదర్శిగా వి. సంజీవ్ కుమార్‌ను, ఉపాధ్యక్షులుగా పి.లోకేష్ కుమార్ ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. పలమనేరు ఏఎంసీ సెక్రెటరీ వి. సంజీవ్ కుమార్, ఉపాధ్యక్షులుగా పి. లోకేష్ కుమార్ లనుమార్కెట్ కమిటీ సిబ్బంది లతోపాటు పలువురుపూల బొకే అందించిశాలువా కప్పిఘనంగా సన్మానించారు.

## అపోలో డయాగ్నోస్టిక్స్ సెంటర్ ప్రారంభం



**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** ఇస్కాన్ రోడ్డులోని ఎన్జీవో కాలనీ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన అపోలో డయాగ్నోస్టిక్ సెంటర్ ను గురు వారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ సరికొత్త సాంకేతికతతో అపోలో డయా గ్నోస్టిక్స్ ద్వారా సమగ్ర రోగ నిర్ధారణ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అపోలో హెల్త్, లైఫ్ స్టైల్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీరామ్ అయ్యర్ మాట్లాడుతూ అపోలో యూనిట్ ఐఎస్వో సర్టిఫికేషన్తో కూడిన ల్యాబ్ను ప్రజలకు అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. ఈ ల్యాబ్ నెలకు 24 వేల నమూనాల ప్రాసెసింగ్ సామర్థ్యంతో విస్తృత స్పెక్ట్రమ్ పరీక్షలను అందించనుందని తెలిపారు. ఇంటి వద్ద శాంపిల్స్, సేకరణ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ ల్యాబ్ ద్వారా ప్రపంచ స్థాయి రోగ నిర్ధారణ సేవలు పొందవచ్చని తెలిపారు. అపోలో డయాగ్నోస్టిక్స్ సీవోవో దేవేంద్ర సింగ్ రాజ్పుత్ మాట్లాడుతూ వివిధ రకాల వ్యాధులు. వాటికి అందిస్తున్న రోగ నిర్ధారణ సేవలను గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అపోలో డయాగ్నోస్టిక్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## చంద్రమ్మ కుటుంబీకులను పరామర్శించిన ఎమ్మెల్యే

**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** మండలంలోని తిరుమలయ్య పల్లి పంచాయతీ వేణుగోపాలపురం గ్రామానికి చెందిన చంద్రమ్మ ఇటీవల మృతి చెందడంతో గంగాధర నెల్లూరు శాసనసభ్యులు డాక్టర్ వి ఎం థామస్ గురువారం చంద్రమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మాజీ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బి ఎం రవి తల్లి కావడంతో ఎమ్మెల్యే థామస్ ఆ గ్రామానికి చేరుకుని చంద్రమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబీకులను పరామర్శించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్సీ అధ్యక్షుడు గుండయ్య, వెదురు కుప్పం క్లస్టర్ ఇంచార్జ్ మోహన్ మురళి, టిడిపి నాయకులు ముని చంద్రారెడ్డి, చంగల్రాయిరెడ్డి, గుర్రప్ప నాయుడు, వరప్రసాద్, కుప్పయ్య తదితరులు పాల్గొన్నారు.



# రేపటి నుంచి మహతిలో జాతీయ స్థాయి నాటక పోటీలు



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** టీటీడీ ధర్మప్రచార పరిషత్ సౌజన్యంతో అభినయ ఆర్ట్స్ హనుమ అవార్డ్ జాతీయ స్థాయి నాటక, నృత్య పోటీలు మహతి కళాక్షేత్రంలో ఈనెల 20వ తేదీ నుంచి 28వ తేదీ వరకు అత్యంత వేడుకగా నిర్వహిస్తున్నట్లు అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి బీఎన్.రెడ్డి తెలిపారు. గురువారం ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అభినయ ఆర్ట్స్ 24వ వార్షికోత్సవంలో భాగంగా తొమ్మిది రోజుల పాటు చేపడుతున్న ఈ పోటీలలో 9 పౌరాణిక పద్యనాటకాలు, 12 సాంఘీక నాటికల ప్రదర్శనలు ఉంటాయన్నారు. అలాగే గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది శాస్త్రీయ, జానపద బృంద, సోలో నృత్య పోటీలకు సుమారు 300 కళాకారుల బృందాలు హాజరై తమ ప్రతిభను కాటనున్నారని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నృత్య పోటీలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 3.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు పౌరాణిక, సాంఘిక నాటక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ జాతీయ స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభతో గెలుపొందిన విజేతలకు చివరి రోజు 28వ తేదీన అభినయ హనుమ అవార్డ్స్ తో పాటు నగదు బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందన్నారు. పోటీలకు హాజరయ్యే కళాకారులు, సహాయకులకు ఉచితంగా నెల్లూరు రుచులతో భోజనాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు ఒక కళోత్సవంగా సాగే నాటక, నృత్య పోటీలకు కళాకారులు, కళాభిమానులు, ప్రజలందరూ హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. అభినయ ఆర్ట్స్ గౌరవాధ్యక్షుడు ఎన్.విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ మన సంస్కృతి, సాంప్రదాయను ప్రతిబింబించే నాటక, నృత్య పోటీలను ఒక పండుగలా తొమ్మిది రోజులు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రస్తుత ఆధునిక సమాజంలో ఆధునిక పోకవడలతో కనుమరుగవుతున్న మన సంస్కృతి, సాంప్రదాయ కళలను నేటి తరానికి అందిస్తున్న నేపథ్యంలో ఈ పోటీలకు పాఠశాలల పిల్లలు సైతం సందర్శింపజేయడం ద్వారా కళలను మరింత ప్రోత్సహించడంతో పాటు విద్యార్థుల కళల విశిష్టత అవగతమవుతుందన్న విషయాన్ని గుర్తించి విద్యార్థులను సైతం భాగస్వామ్యులు కావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో అభినయ ఆర్ట్స్ ముఖ్య సలహాదారుడు విజయకుమార్, అధ్యక్షుడు మబ్బు సూర్యనారాయణరెడ్డి, సభ్యుడు ఇరముని శేఖర్ పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకై అవగాహన ర్యాలీ

**– తిరుపతి జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాసులు నాయక్**

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** భద్రత ఉత్సవాలలో భాగంగా రోడ్డు ప్రమాదాల భారిన పడకుండ జాగ్రత్తలు పాటించాలంటూ శ్రీకాళహస్తి న్యాయస్థానం 12వ తిరుపతిజిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాసులు నాయక్, సీనియర్ సివిల్ జడ్జ్ బేబీ రాణి ఆధ్వర్యంలో న్యాయవాదులు పి ఎల్ వీ లు శ్రీకాళహస్తి పట్టణంలో నాలుగు మాడవీధులలోహెల్మెట్ వాడకం వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన ర్యాలీనిర్వహించారు,



ఈ సందర్భంగా శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా జడ్జ్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ ప్రమాదాలను నియంత్రిచే విదంగా ప్రజలకు హెల్మెట్ వాడకాన్ని అలవరుచుకునే విధంగా అవగాహన ర్యాలీ నిర్వహించామన్నారు. ఇప్పటికే తమ కోర్టులో మోటార్ వెహికల్ యాక్సిడెంట్ కేసులు 100కు పైగా ఉన్నాయని, ఉరుకులు.. పరుగుల జీవితంలో వేగానికి ఉన్న ప్రాధాన్యత భద్రతకు ఇవ్వకపోవడంతో భారీ మూల్యం చెల్లించక తప్పడంలేదు. చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని అవగాహన లేని వాహనదారుల నిర్లక్ష్యం ధోరణి కారణంగా ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే రోడ్డు ప్రమాదాల విషయంలో ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉండదని రవాణావాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నప్పటికీ గమ్యానికి త్వరగా చేరుకోవాలనే ఆతృతతో హెల్మెట్ వాడకాన్ని విస్మరిస్తున్నారు. వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడంతో చాలా మంది రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్నారని, హెల్మెట్ ధరించి వాహనాలు నడపటం వలన ఒక రక్షణ కవచంలా ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి తమ విలువైన ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు.

# రైతులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

**– ఏఎంసీ సెక్రెటరీ వి. సంజీవ్ కుమార్**

**పలమనేరు, మేజర్‌న్యూస్:** స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవర ణలో గురువారం రైతులు వ్యాపారస్తులతో సమావేశాన్ని ఏఎంసీ సెక్రె టరీ వి. సంజీవ్ కుమార్ నిర్వహించారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులకు మెరుగైన వసతులు కల్పిస్తామనితెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు మండీల ముందర బురద ఉండడం వలన గత వారం రోజులుగా కార్యాలయ సిబ్బంది చే జెసిబి సహాయముతో బురదనుతొలగించారు. కర్ణాటక తమిళనాడు, ఆంధ్ర రాష్ట్రాల నుండి వాహనాలు విపరీతంగా రావడంతో ట్రాఫిక్ సమస్య కూడాఉండేది.దానిని కూడారైతులకు మండి వ్యాపారస్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. అదేవిధంగామండి యజమానులకు రైతుల పండించిన టమోటాలకు తక్కువ ధర ఇవ్వకుండా వారికి మెరుగైన ధరకల్పించాలని ఆయన తెలిపారు. వడ్డిపల్లి,ములుభాగల్ సోమల, పుంగనూరు,అక్కడ ఇక్కడ ధరలను రైతులు పోల్చుకున్నారు. ఇక్కడ తమకుతక్కువ ధరఇస్తున్నారనిఏఎంసీ సెక్రటరీ వి.సంజీవ్ కుమార్ దృష్టికి రైతులు తెలపగా వెంటనే వారిని పిలిపించి ఇక మీదట ఇలాంటి తేడాలు రాకూడదనితెలిపారు.వడ్డేపల్లి ములభాగల్ప్రాంతాల్లోని రైతులు టమోటాలనుదోరగా ఉండడంతోవాటికి ధర కొద్దిమేరా పెరుగుతుం



దన్నారు. మన మార్కెట్ మాత్రం మాగిన టమోటాలు అధికంగా రావడం వలన కొద్దిగా ధర తగ్గుతున్నది. అని అన్నారు. ఇకమీదట అలాంటి తేడాలు రాకుండా ఇలాంటి సమస్యలు రైతులు తన దృష్టికి తీసుకురా కుండా ఉండాలనితెలిపారు. ఎవరైనా ఇకమీదట రైతు లను ఇబ్బంది పెడితేఅలాంటి మండి లపైచర్యలు తీసు కుంటామన్నారు.రైతులకు త్రాగునీటి వసతి మురుగు దొడ్ల వసతి అన్ని వసతులు ఉన్నాయనిఆయన తెలిపారు. మన మం డికి వచ్చే రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకూడదనిఆయన తెలిపా రు. ఈ కార్యక్రమంలో మండి యజమానులు, రైతులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు పేరు చెప్పి రాజీవ్ నగర్ కాలనీలో అక్రమాల చేస్తే తాటతీస్తా

**శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి**

**శ్రీకాళహస్తి మేజర్ న్యూస్:** శ్రీకాళహస్తి ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు పేరు చెప్పి అక్రమాలు చేస్తే తాటతీస్తా అని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పత్రిక విలేకరుల సమావేశంలో తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి పట్టణం రాజీవ్ నగర్ కాలనీలో మా కుటుంబ సభ్యులు పేరు చెప్పి దౌర్జన్యాలు. అక్రమాలు కబ్జాలు చేస్తే సహించమని. కొంతమంది స్టిక్కర్లు అంటించడం ఇళ్లకు బేగాలు వేయడం కార్యక్రమాలు చేస్తున్నారని వారిపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణంలో బెట్టింగులు. గుట్కా, మట్కా



గంజాయిపై ఉక్కు పాదం. మైనార్టీ నాయకుడు పద్ధతి మార్చుకోవాలి.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారిపైనైనా సరే కఠిన చర్యలు. అతి త్వరలో శ్రీకాళహస్తికి పరిశ్రమలు నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మన్నవరం ప్రాజెక్టుపై సీఎంతో చర్చిస్తా. ఓ పరిశ్రమ నిర్వాహక దాత సహాయంతో నియోజకవర్గంలో అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు.

ఈఏడది ఏడు గంగమ్మల జాతరను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.

# కుప్పం నియోజకవర్గంలో ఇంటింటి సర్వేలో కంటి సమస్యలు ఉన్న వారిని గుర్తించండి

**-మెరుగైన వైద్య సేవలు అందించండి**
**: జిల్లా కలెక్టర్**



**కుప్పం, మేజర్‌న్యూస్:** నియోజక వర్గంలో ఇంటింటి సర్వేలో భాగంగా కంటి సమస్యలు ఉన్న వారిని గుర్తిం చాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మెడికల్ ఆఫీసర్ల ను ఆదేశించారు. గురువారం సాయంత్రం కుప్పం తహసిల్దార్ కార్యాలయంలో కుప్పం నియోజకవర్గ మెడికల్ ఆఫీసర్లతో జిల్లా కలెక్టర్ ఎమ్మెల్సీ డా.కంచర్ల శ్రీ కాంత్, కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మ త్ లతో కలిసి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గం లో మెడికల్ ఆఫీసర్లు వారి పరిధిలోగల ఆశా,ఏఎన్ఎంల సమ న్వయం తో ఇంటింటి సర్వే కార్యక్రమంలో భాగంగా కంటి సమస్యలు ఉన్న వారిని గుర్తించాలని తెలిపారు.కంటి సమస్యలు ఉన్న వారిని గుర్తించిన అనంతరం మండల స్థాయి లో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఉచిత ఆపరేషన్లు చేసేందుకు చర్యలు చేపట్టడం జరుగు తుందన్నారు.అదేవిధంగా పి హెచ్ సిలకు ఏరియా ఆసుపత్రులకు వైద్య సేవల నిమిత్తం వచ్చే పేషెంట్లకు సత్వరమే మెరుగైన వైద్య సేవలు అందించాలనిఆదేశించారు.కుప్పం నియోజకవర్గంలో 13 పీ హెచ్ సి లు ఉండగా.. అందులో రెండు అర్బన్ పరిధిలో కలవని రామ కుప్పం-3 గుడిపల్లి- 2, శాంతిపురం- 2 కుప్పం-4 పి హెచ్ సి లు కలవని, ప్రతి పిహెచ్సి పరిధిలో ఇద్దరు డాక్టర్లు కలరని డి ఐ ఓ అనిల్ కుమార్ కలెక్టర్ కు వివరించారు.ఈ సమావేశంలో కుప్పం ప్రాంతీయ ఆసుపత్రి మెడికల్ సూపరెంటెంట్ డా. విజయ కుమారి,నాయకులు మునిరత్నం, డా .సురేష్ మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# దళారులుగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు



**భక్తులను ఏమార్చి అక్రమ వసూళ్లకు పాల్పడే ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్**

**తిరుపతి బ్యూరో మేజర్‌న్యూస్ :** శ్రీవారి దర్శనార్థం తిరుపతికి విచ్చేసే భక్తులను ఏమార్చి దగా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని తిరుపతి డిఎస్పి రవి మనోహర చారి హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు తిరుపతి పరిధిలో భక్తులను ఏమార్చి అక్రమ వసూళ్లకు పాల్పడే 6 మంది ఆటో డ్రైవర్లకు తిరుపతి డిఎస్పి రవి మనోహర్ ఆచారి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు టీటీడీ యాప్ ను తమ మొబైల్ లో డౌన్లోడ్ చేసుకుని అందుబాటులో ఉన్న శ్రీవారి దర్శన టోకెన్లను పరిశీలిస్తారు. అనంతరం రైల్వే స్టేషన్ బస్ స్టేషన్ వద్ద భక్తులకు ఎలాగైనా దర్శనం టోకెన్లు ఇప్పిస్తామని నమ్మబలికి విష్ణు నివాసం, శ్రీనివాసం, భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాస మంగాపురం ప్రాంతాలలో సర్వదర్శనం టోకెన్లు ఇచ్చు కౌంటర్ వద్ద సదరు భక్తులకు సర్వదర్శన టోకెన్లు ఇప్పించి అధిక మొత్తంలో అమాయక భక్తుల నుండి డబ్బులు గుంజడమే వీరి ప్రవృత్తి అని డిఎస్పి తెలిపారు. ఈ విధంగా భక్తులను ఏమార్చి అధిక వసూళ్లకు పాల్పడుతూ దోచుకుంటున్నారని, ఇకపై ఈ విధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పెద్దపంజాణి ఇంచార్జ్ ఎస్సైగా సహదేవి

**పెద్దపంజాణి, మేజర్ న్యూస్ :** పెద్దపంజాణి పోలీస్ స్టేషన్ ఇంచార్జ్ ఎస్సైగా బి సహదేవి బాధ్యతలు స్వీకరించారు. గతంలో పెద్దపంజాణి ఎస్ఐగా పనిచేసిన శ్రీనివాసులు వి ఆర్ కు బదిలీ కాగా ఆ స్థానంలో పలమనేరు పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై సహదేవి ని ఇన్చార్జ్ ఎస్సైగా పెద్దపంజాణికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ న్యాయం చేస్తానని చెప్పారు.



# చినుకు పడితే - దారి మూతే



**చౌడేపల్లి మేజర్‌న్యూస్:** మండలం లోని శెట్టిపేట గ్రామ పంచాయతీ మేకలచిన్నేపల్లి ప్రాథమిక పాఠశాల,అంగన్ వాడి సెంటర్లకు చిన్నపాటి చినుకులు పడితే కూడా పాఠశాలకు వెళ్ళడానికి దారి బురదనీటితో నిండిపోతుంది.పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు పాఠశాలకు వెళ్ళాలంటే బురదనీటిలోనే వెళ్ళాల్సివస్తుంది. సంబందిత అధికారులు తక్షణ చర్యలు తీసుకొని వెంటనే దారిని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు.

# రథం పై ఊరేగిన ద్రౌపతి అర్జునుడు కృష్ణుడు

**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** ం:కార్వేటి నగరంలో వెలిసిన ద్రౌపతి సమేత ధర్మరాజుల ఆలయంలో తిరునాళ్లు సందర్భంగా గురువారం ఉదయం ఆలయంలో స్వామి అమ్మవార్లకు అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి పుష్కరి నుంచి తీర్థం తీసుకొని అభిషేకం నిర్వహించారు.మధ్యాహ్నం ఆలయం వద్ద రెడ్డమ్మ భాగవతాధారిని హరికథ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి ఆలయంలో ద్రౌపతి అర్జునుడు కృష్ణుడు రథంపై ఊరేగించారు. ఆలయం దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి వీధి నాటకం వెంకటేశ్వర నాటక కళామండలి కిరణ్ కుమార్ బృందం చేత ద్రౌపతి కళ్యాణం వీధి నాటకం నిర్వహించారు. ఉభయ దాతలుగా కరుణిక కులస్తులు ఆలయం చుట్టూ విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సోమనాథ్, ప్రధాన కార్యదర్శి హరికుమార్, కమిటీ సభ్యులు భక్తులు మహిళలు పాల్గొన్నారు.

# చంద్రగిరి అభివృద్ధికి అందరు సమన్వయంతో పని చేయాలి

**ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించిన సర్పంచులు, ఎంపీటీసీలు...**
**మండల సమస్యల పై సుధీర్ఘంగా కొనసాగిన సమావేశం...**
**ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పులివర్తి నాని...**



**చంద్రగిరి మేజర్ న్యూస్:** చంద్రగిరి మండలంలో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారమే అజెండాగా మండల సర్వసభ్య సమావేశం కొనసాగింది. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించిన చంద్రగిరి మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎంపీటీసీలు సర్పంచులు పార్టీలకు అతీతంగా ఆప్యాయతలు పంచుతూ ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలోనే రాజకీయాలని మిగిలిన సమయంలో మనమందరం ప్రజాసేవకులమన్నది మరవకూడదన్నారు. పార్టీలకు వర్గాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేయాల్సిన అవసరాన్ని నాని నొక్కి చెప్పారు. రెవెన్యూ,మండల పరిషత్,విద్యుత్, వ్యవసాయం, విద్య,వైద్యం ఇతర శాఖల పనితీరుపై, ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే ఆరా తీసారు. చేపట్టవలసిన పనులను అధికారులు నివేదిక రూపంలో తయారు చేయాలని తద్వారా ప్రాధాన్యత క్రమంలో నిధులు మంజూరు చేయించుకుని ముందుకు సాగవచ్చును అన్నారు. అన్ని గ్రామాలలో పారిశుధ్యం మెరుగుపరచాలని,కనీస మౌలిక వసతులను కల్పించాలని సూచించారు. అధికారులు పార్టీలకు అతీతంగా పనిచేయాలని ఎమ్మెల్యే పులివర్తి నాని దిశానిర్దేశం చేసారు. స్నేహపూర్వక వాతావరణం లో సర్వసభ్య సమావేశం కొనసాగటం చర్చ నీయాసంగా మారింది.

# 26 వార్డుల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

**పలమనేరు, మేజర్ న్యూస్:** మున్సిపాలిటీ పరిధిలోని 26 వార్డుల్లోని ముమ్మరంగా పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రధానంగా పట్టణంలోని ప్రజలకు త్రాగునీటి సమస్య తలెత్తకుండా ఉండడానికి ప్రణాళికలుసిద్ధం చేస్తున్నారు. అదేవిధంగా పట్టణంలోని ప్రజలకు ట్యాంకుల ద్వారా నీరు సరఫరాఅయ్యేది.ట్యాంకుల శుభ్రతను కూడాఆయన పరిశీలించారు.ఇందులో ప్రధానంగాకాలువ పనులు



కాలువల్లో పూడికతీత కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా కార్మికుల చేతపని చేయించుచున్నారు.అదేవిధంగా పట్టణంలోని ప్రధాన రహదారులు ప్రక్కన దినసరి కూరగాయలు విక్రయించు వారు రోడ్డుపై కూరగాయలనుపెట్టి ఆక్రమించుకున్నారు. వారందరికీ ఆయన సంతలో స్థలం కేటాయించి ఏర్పాటు చేశారు. ఇకమీదట అక్కడ కూరగాయల వ్యాపారస్తులు విక్రయించుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండడం వలన రాకపోకలకు ఇబ్బంది ఉండడంతో ఆయన దీనిపై ప్రధానంగా దృష్టి సాధించారు. పట్టణంలోని రోడ్లపై కూడాచెత్తాచెదారం ఉండకుండాజాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఏది ఏమైనాప్పటికీ ప్రజలు ఆరోగ్యమే ముఖ్యంగా భావించి ఏఎన్ఎం ల ద్వారా ఆరోగ్య సిబ్బంది ద్వారాప్రజలకు కాచిన నీటిని తాగాలని తెలుపుతున్నారు. ఇందులో ఎద్దుల చెరువు కట్ట వద్ద చెత్తాచెదారం వేసి ఉండడం వలన ఆ మార్గం గుండా వెళ్లే ప్రజలు దుర్వాసన వేద జగడం వలన ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తేవడం జరిగిందన్నారు.

# విజయ్‌సాయిరెడ్డి వ్యాఖ్యలుపై జర్నలిస్టుల నిరసన

**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:**వైయస్సార్ పార్టీ సీనియర్ నాయకుడు ఎంపీ విజయసాయి రెడ్డి విధినిర్వహణలో ఉన్న విలేకరులు దూషించడంపై టివి 5, మహాటివి, ఆంధ్రజ్యోతి, ఈ టీవీ, విలేకరుల ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ధర్నా నిర్వహించి, విజయసాయిరెడ్డి వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు, విలేకరులను దూషించడం మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు అంటూ విలేకరులు విజయసాయి రెడ్డి మాస్ వార్నింగ్ ఇచ్చారు. ముందుగా శ్రీకాళహస్తి అంబేద్కర్ విగ్రహం వద్ద విజయసాయి రెడ్డి డౌన్ డౌన్, విలేకరులను బహిరంగ క్షమాపణ చెప్పాలంటూ నినాదాలు చేస్తూ విలేకరులు నిరసనధర్నా చేపట్టారు, అనంతరం ప్రజాస్వామ్యంలో విలేకరులపై దూషిస్తున్న ఇలాంటి వ్యక్తులను రాజ్యాంగపరంగా శిక్షించాలంటూ రాజ్యాంగ కర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు పూలమాలలు వేసి నివాళులర్పించి వినతిపత్రం అందజేశారు. తదుపరి శ్రీకాళహస్తి డిఎస్పి కార్యాలయానికి వెళ్లి విజయసాయి రెడ్డిపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ సీనియర్ రిపోర్టర్స్ మాట్లాడుతూ ఓ ఉన్నత హోదాలో ఉన్న ప్రజా నాయకుడు, విజయసాయి రెడ్డి అతనిపై వస్తున్న విమర్శలను అతని పరిష్కరించుకోవాలి కానీ, ఆ వార్తలపై కథనాలు ప్రచారం చేస్తున్న



విలేకరులను దూషించడం ఎంతవరకు సమంజసం అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో మారువిజయసాయి రెడ్డి విలేకరులను దూషించు విధంగా మాట్లాడితే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు అంటూ విజయసాయి రెడ్డి ని హెచ్చరించారు, ఏ రాజకీయ నాయకుడిని అయినా ఉన్నత స్థాయికి తీసుకు పోవడంలో పత్రిక విలేకరుల హస్తం ఉందని, అలాంటి పత్రిక విలేకరులను, రాజకీయ నాయకుల అంతరంగ విషయంలో వచ్చిన విమర్శలపై కథనాలు రాస్తున్న విలేకరులను దూషిస్తూ మాట్లాడడం సమంజసం కాదని, ఇలా మరో మారు విజయసాయి రెడ్డి విలేకరులు దూషిస్తూ మాట్లాడితే రాష్ట్రంలోని విలేకరులంతా ఒక్కటై విజయసాయి రెడ్డికి తగినబుద్ధి చెబుతామని హెచ్చరించారు. శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల పేరుతో ఆర్థిక అక్రమాలపై విచారణ చేపట్టాలి : ఏపీ జూడో సంఘం డిమాండ్

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** క్రీడల పేరుతో ఆర్థిక అక్రమాలకు పాల్పడిన వారు, క్రీడాకారులనుర మానసికంగా శారీరకం వేధిస్తున్న వారిపై విచారణ చేసి కేసు నమోదుతో సత్వర చర్యలు తీసుకోవాలని ఏపీ జూడో సంఘం కోశాధికారి చీనేపల్లి కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు ఏపీ జూడో సంఘం అధ్యక్షుడుగా ఆనం రామకిషోర్ రెడ్డిని నియమించనని తెలిపారు. వెంకట్ నామిశెట్టిని ఆర్థిక లావాదేవీల్లో జరిగిన అక్రమాలకు జేఎస్ఐ సస్పెండ్ చేసిందన్నారు. అయినా వెంకట్ నామిశెట్టి జూడో సంఘం తనదే అంటూ సీఈవో అని చెప్పుకుంటూ జిల్లా సంఘాలకు గుర్తింపు ఇస్తామని లక్షల రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్నాడుఅని ఆరోపించారు. ఎలాంటి గుర్తింపు లేని సంఘాలకు నాయకులు అని చెప్పుకుంటూ వెంకట్ నామిశెట్టి, ఆకుల వెంకట్ రాఘవేంద్రరావు మొన్న విజయవాడలో జరిగిన సమావేశంలో ఏపీ ఒలంపిక్ సంఘం తమదే అంటూ గతంలో ఒలంపిక్ సంఘ కార్యదర్శి ఆర్కే. పురుషోత్తం నాయుడు 3 లక్షలు తినేశారని అతనిపై విచారణ చేయాలని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ప్రభుత్వం, క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి వెంటనే స్పందించి క్రీడల పేరుతో ఆర్థిక అక్రమాలకు పాల్పడుతున్న వారిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తద్వారా ఆంధ్రప్రదేశ్ క్రీడలను, క్రీడా సంఘాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో చిత్తూరు జిల్లా త్రోబాల్ సంఘం కార్యదర్శి కిరణ్, సభ్యుడు ప్రదీప్ పాల్గొన్నారు.



## కపిలేశ్వరుడు పవిత్రోత్సవాలు ప్రారంభం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** శ్రీకపిలేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు జరుగనున్న పవిత్రోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం పంచమూర్తులైన శ్రీకపిలేశ్వరస్వామి, శ్రీకామాక్షి అమ్మవారు, విఘ్నేశ్వరస్వామి, శ్రీసుబ్రమణ్యస్వామి, చండికేశ్వరస్వామివార్ల ఉత్సవర్లకు పాలు, పెరుగు, తేనె, పసుపు, గంధం తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు.



సాయంత్రం కలశపూజ, హోమం, పవిత్ర ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్స వాల్లో తెలియక కొన్ని దోషాలు జరుగుతుంటాయి. వీటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా శైవాగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ కృష్ణ వర్మ,, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## విజయసాయి రెడ్డి వ్యాఖ్యలు అప్రజాస్వామికం



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ప్రజా సమస్యలను, ప్రజా వ్యతిరేక కార్యకలాపాలను వెలుగులోకి తీసుకువచ్చేందుకు అహ ర్నిశలు శ్రమించి విధులు నిర్వహించే పాత్రికేయులపై వైసిపి నేత, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి వ్యాఖ్యలు అప్రజా స్వామికమని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద్ గౌడ్ మండిపడ్డారు. విజయసాయి రెడ్డి వ్యాఖ్యలకు తప్పుబడుతూ ఎంపీ పదవికి మచ్చతెచ్చేలా పాత్రికేయులను దుర్భాషలాడారాని విమర్శించారు. తనపై వచ్చిన ఆరోపణలకు సమాధానం ఇవ్వకుండా ఓ సామాన్యుడికి విజయసాయిరెడ్డి చేసిన అన్యాయాన్ని వెలుగులోకి తీసుకొచ్చిన మీడియాపై అసభ్యపదజాలంతో దూషించడం అతని అహంకారానికి నిదర్శనమ న్నారు. జర్నలిస్టులపై సాయిరెడ్డి వ్యాఖ్యలను వైసిపి ఇప్పటివరకు ఖండించలేదంటే ఆ పార్టీ కూడా సాయిరెడ్డి వ్యాఖ్యలను సమర్థిస్తున్నట్లేనని, పాత్రికేయులు, ప్రజలు వైసిపి వైఖరిని గమనించాలన్నారు.

## ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటిపై దాడి అమానుషం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** సీనియర్ దళిత నేత, మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటిపై, ఎంపీ మిథున్ రెడ్డి టీడీపీ మూకల దాడి చేయడం అమానుషమని వైఎస్ఆర్సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లారపు మధు ఒక ప్రకటనలో దాడిని ఖండించారు. ప్రజాస్వామ్య బద్ధంగా శాంతియుతంగా నిరసన చేయడం విస్మరించి అరాచక శక్తుల్లా దాడికి పాల్పడుతూ భయాందోళనకు గురి చేయడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. రాజకీయంలో గెలుపు ఓటమి సాధరణమని, దీనిని అలసుగా తీసుకొని దుర్మార్గపు చర్యలతో దాడులకు పూనుకోవడం టీడీపీ అరాచకాలకు నిదర్శమని తెలిపారు. ప్రజా సంక్షేమ పాలన కోసం ప్రజలు అధికాం మిస్తే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడడం సమంజసం కాదని తెలిపారు. ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్పపై దాడి హేమమైన చర్య ఎంపి మిథున్రెడ్డిపై, మాజీ ఎంపీ రెడ్డెప్పపై టీడీపీ మూకలు దాడి చేయడం హేమమైన చర్య అని వైఎస్ఆర్సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నల్లానిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రాన్ని నాశనం చేసే ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ పరిపాలన సాగించాలని భావిస్తున్న మిమ్మల్ని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఒక దళిత మాజీ ఎంపీ రెడ్డెప్పపై ఇలాంటి చర్యకి పూనుకోవడం చాలా దురదృష్టకరమని, ఎంపీ మిథున్రెడ్డిపై రాళ్ల దాడి పిరికిపంద చర్య అని తెలిపారు.

## ఎస్‌వీయు నాన్ టీచింగ్ నూతన కార్యవర్గానికి ఘనసన్మానం

**తిరుపతి రెవెన్యూ, మేజర్‌న్యూస్:** గతవారం జరిగిన ఎస్వీయూ నాన్‌టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ 16వ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన అధ్యక్ష కార్యదర్శుల గుర్రంకొండ శ్రీధర్ సుబ్రమణ్యం నూతన కార్యవర్గానికి హాస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు గురువారం ఘనంగా సన్మానించారు. వారిని శాలువా పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో చంద్రయ్య పీకే సుబ్రహ్మణ్యం పొద్దుటూరి నాగరాజుకి, నరసింహులు లోకేష్, గిరి, అశోక్, మహేష్, ధనుంజయులు, మునికృష్ణారెడ్డి, సురేష్, కృష్ణ, గౌతమి, గౌరీ, చంగమ్మ, వనజ, వాణిలు పాల్గొన్నారు.



## వైకాపా అక్రమాలపై శ్వేత పత్రం విడుదల

### ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్



**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** వైకాపా ఐదేళ్ల పాలనలో జరిగిన అక్రమాలు దోపిడీల పై ఏపీ ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేస్తుందని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ తెలిపారు. గురువారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియాతో మాట్లాడుతూ ఐదేళ్లలో రూ.35,576 కోట్ల విలువచేసే 1.75లక్షల ఎకరాల భూ ఆక్రమణలు జరిగిందన్నారు. ఇళ్ళ పట్టాల పేరుతో 10వేల ఎకరాలు, ఇసుక దందాలో రూ.9,750కోట్లు దోచుకున్నారన్నారు. ఉచిత ఇసుక విధానాన్ని రద్దుచేసి నూతన ఇసుక విధానం పేరుతో 20వేల మంది కార్మికుల భవన నిర్మాణ రంగాన్ని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కుప్ప కూల్చిందన్నారు. చిత్తూరులో 782 ఎకరాల భూమిని, ఒంగోలులో 101కోట్ల ఆస్తిని కాజేసేందుకు వైసిపి నేతలు ప్రయత్నించాలని దీనిపైన పూర్తి స్థాయిలో విచారణ చేపట్టామన్నారు. ల్యాండ్ టైటిలింగ్ పేరుతో భూదందాకు పాల్పడ్డారన్నారు. రైతుల నుండి భూములను తక్కువ రేటుకు కొని ప్రభుత్వానికి ఎక్కువ రేటుకు విక్రయించి వైసిపి నేతలు దందాలకు పాల్పడ్డారన్నారు. వైసిపి కార్యాలయాలకు సుమారు 300కోట్ల విలువ చేస్తే భూమిని తక్కువ రేటుకు కబ్జా చేశారన్నారు. గృహ నిర్మాణ శాఖకు సరఫరా పేరుతో 98 లక్షల టన్నుల ఇసుక దందాకు పాల్పడ్డారన్నారు. ఈకార్యక్రమంలో మాజీఎమ్మెల్సీ దొరబాబు, మాజీమేయర్ హేమలత రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ పాల్గొన్నారు.

## పేదలకు అందుబాటులో సన్న బియ్యం

**రామచంద్రపురం, మేజర్‌న్యూస్:** దారిద్ర రేఖకు దిగువన ఉన్న పేద ప్రజలకు సరసమైన ధరలకు నాణ్యమైన సమ్మదీయాన్ని అందించటానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని రామచంద్రాపురం తాశీల్దార్ ఉషారాణి అన్నారు. నిత్యవసర వస్తువులను రాయితీ ధరలతో అందించటానికి రామచంద్రాపురం మండలం,సి రామాపురంలో ఎంపిక చేసిన జిఆర్ కే హోల్సేల్ మార్కెట్ ను గురువారం అధికారికంగా తాశీల్దారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో నిత్యవసర వస్తువుల ధరలు అధికంగా ఉండటంతో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రాయితీతో నాణ్యమైన వస్తువులను అందించటానికి ఎమ్మెల్యే పులివర్తి నాని సహకారంతో జి ఆర్ కే హోల్సేల్ మార్కెట్ ను ఎంపిక చేసినట్లు తెలియజేశారు. అవసరమైన వారు కందిపప్పును 160 రూపాయలకు, ముడి బియ్యాన్ని కిలో 49 రూపాయలకు, ఆఫ్ బాయిల్ రైస్ ని కిలో 48 రూపాయలకు పొందవచ్చునని చెప్పారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు కొట్ట నరసింహారెడ్డి,సి రామాపురం గ్రామ కమిటీ అధ్యక్షులు రామిరెడ్డి,చంద్రగిరి నియోజకవర్గం యూత్ కొట్టే ధనంజయ రెడ్డి,జి.సుబ్రమణ్యం రెడ్డి,రంజిత్, మార్కెట్ నిర్వాహకులు, వీఆర్వోలు ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



## మొక్కలు నాటేందుకు సహకరిస్తాం :కలెక్టర్

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** కార్పొరేట్ సామాజిక బాధ్యతగా టైమ్స్ ఆఫ్ ఇండియా న్యూఢిల్లీ, టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రీన్ డ్రైవ్ కార్యక్రమం ద్వారా జిల్లా తడ మండలంలోని శ్రీసిటీ పారిశ్రామిక ప్రాంతసమీపంలో సుమారు 50 వేల బయో డైవర్సిటీ మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణ దిశగా అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. గురువారం కలెక్టరేట్ నందు జిల్లా కలెక్టర్ టైమ్స్ఆఫ్ ఇండియా సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. గ్రీన్ డ్రైవ్ ఇనిషియేటివ్ లో భాగంగా బయో డైవర్సిటీ మొక్కలు నాటే కార్యక్రమాన్ని శ్రీసిటీ పారిశ్రామిక వాడ సమీపంలో చేపట్టటానికి సుముఖంగా ఉన్న నేపథ్యంలో రెవెన్యూ, సోషల్ ఫారెస్ట్రీ అటవీ శాఖ వారు సమన్వయంతో మొక్కలు నాటే కార్యక్రమానికి సహకారం అందించాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వారు చేస్తున్న ఈ కృషి అభినందనీయం అన్నారు. టైమ్స్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ సందీప్ సూద్ వివరిస్తూ వారు గతంలో నుండే భారతదేశంలోని పలు ప్రాంతాల్లో కార్పొరేట్ సామాజిక బాధ్యతగా వారు పర్యావరణ పరిరక్షణ, హరిత వన అభివృద్ధి తదితర కార్యక్రమాలు చేపట్టామని, తిరుపతి జిల్లాలో సూచించిన ప్రాంతాలలో 50 వేల బయో డైవర్సిటీ మొక్కలను నాటి వాటిని మూడు సంవత్సరాల వరకు సంరక్షిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, సోషల్ ఫారెస్ట్ డిఎఫ్ఓ ధర్మరాజు, టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రతినిధి రిచర్డ్ అధికారులు పాల్గొన్నారు.



## ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళం

**తిరుమల, మేజర్‌న్యూస్:** బెంగుళూరుకు చెందిన ఏబియం ఇన్ఫ్రాటెక్ అధినేత ఎస్.ఎన్.బ్యాటేగౌడ టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు గురువారం రూ.10 లక్షలు విరాళంగా అందించారు. తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో టీటీడీ ఈఓ జె.శ్యామల రావుకు ఈ మేరకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## కాళిదాసు సాహిత్య వైజ్ఞానిక వైభవం జాతీయ సదస్సు ప్రారంభం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:**

సాహిత్య అకాడమీ న్యూఢిల్లీ జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో కాళిదాస సాహిత్యంలో సాహిత్యక, కావ్య సౌందర్యం వైజ్ఞానిక వైభవం అనే అంశం పైన రెండు రోజులపాటు జాతీయ సదస్సు గురువారం చెలికాని అన్నారావు సభ భవనంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా సాహిత్య అకాడమీ సంస్కృత పరామర్శ మండల సంయోజకలు, రాష్ట్రీయ సంస్కృత విద్యా పీఠం, భూతపూర్వ ఉపకులపతి ప్రొ.హరే కృష్ణ శథపతి విచ్చేసి సాహిత్య శాస్త్రంలో ఉన్న సాహిత్య మాహాత్మ్యం, కావ్య సౌందర్యం, వైజ్ఞానిక వైభవం, సౌందర్య శాస్త్రం



మొదలైనటువంటి వైజ్ఞానిక సంబంధిత అంశాలపై ఉపన్యాసం చేశారు. సంస్కృత సాహిత్యంలో ప్రాచీన కాలంలోనే అవసరమైన గొప్ప గొప్ప వైజ్ఞానిక అంశాలను ఆనాటి కవులు, మహర్షులు, ఋషుల ద్వారా వర్ణించడం జరిగిందని సూచించారు. సాహిత్య శాస్త్ర రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం భూతపూర్వ ఉపకులపతి ప్రొ.ఎస్.సుదర్శన్ శర్మ మాట్లాడుతూ సంస్కృత శాస్త్రాల్లో ప్రాచీన కవుల ద్వారా ఎన్నో వైజ్ఞానిక అంశాలను విపులంగా విశదీకరన చేశారు. విశిష్ట అతిథి రాష్ట్రపతి పురస్కార గ్రహీత సాహిత్య శాస్త్ర రిటైర్డ్ ప్రొఫెసర్.కె.రామసూర్యనారాయణ మాట్లాడుతూ సాహిత్య శాస్త్రంలో అనేకమైన వైజ్ఞానిక అంశాలు వివరించారు. విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ జిఎస్ ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో సాహిత్య శాస్త్రాది గ్రంథాలలో ఉన్న వైజ్ఞానికత అంశాలను వెలికి తీసి భావితరానికి అందించడమే లక్ష్యంగా ఇటువంటి జాతీయ సదస్సులను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సాహిత్య విభాగము అధ్యక్షులు ప్రొఫెసర్ కె.రాజగోపాలన్, డాక్టర్ భరత్ భూషణ్ రథ్, విశ్వవిద్యాలయంలోని విభిన్న విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు, రీసర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు.